తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక

అక్టోబరు 2016 వెల రూ.5/-



03-10-2016 ధ్వజారోహణం (సాయంత్రం)



గరుడ గమన గరుడధ్వజ నరహరి నమో నమో నమో

03-10-2016 పెద్దశేషవాహనం (రాత్రి)



కదిసిపనులకెల్ల గాచుకొన్నశేషుడు
మొదలదేవతలెల్లా మొక్కేశేషుడు

04-10-2016 చిన్నశేషవాహనం (పగలు)



వీడుగదే శేషుడు శ్రీ వేంకటాద్రిశేషుడు

దైవంబితడని తలచరో...


వీధులవీధుల విభుడేగీ నిదె
మోదముతోడుత మ్రొక్కరో జనులు

గరుడధ్వజమదె కనకరథంబదె
అరదముపై హరి యలవాడే
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరగ బగ్గములు పట్టరో జనులు

ఆడే రదివో యచ్చరలెల్లను
పాడేరు గంధర్వపతులెల్లా
వేడుకతో వీడే విష్వక్సేనుడు
కూడి యిందరును జూడరో జనులు

శ్రీవేంకటపతిశిఖరముచాయదె
భావింప బహువైభవములవే
గోవిందనామపుఘోషణ లిడుచును
దైవంబితడని తలచరో జనులు

(సంపుటం-4, సంకీర్తన -286)



బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ వైభవాన్ని అన్నమయ్య కీర్తించిన తీరు అద్భుతం! పరమాద్భుతం!!

అదిగో! వీధి వీధినా సంచరిస్తున్న విభుడు వేంకటేశ్వరుడు! ఓ భక్తజనులారా ముదమారా చేతులెత్తి మొక్కండి.

అదిగో! గరుడధ్వజంతో ఉన్న బంగారు తేరు! ఆ రథంలో విరాజిల్లుతున్న హరిని చూడండి, ఆయనకు ఇరు వైపులా శ్రీదేవి భూదేవేరులు! జనులారా! దివ్యమైన ఆ రథం పగ్గాలను పట్టుకొని లాగండి.

ఆ రథం ముందుభాగంలో చూడండి: అప్సరసలు ఆడుతుండగా, గంధర్వులు పాడుతున్నారు! వీళ్లందరితో పాటు విష్వక్సేనుడు వేడుకతో నడుస్తున్నారు.

అదిగో! మెరుపులతో ప్రకాశిస్తున్న వేంకటాచలశిఖరాలు. ఆ వేంకటపతి వైభవాలను తలుస్తూ, గోవిందనామ ఘోషలు చేస్తూ, అద్భుతమైన దేవుడని భావించి కొలవరో జనులారా!



తిరుచానూరు
శ్రీ పద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు-2016
నవంబరు 25 నుండి డిసెంబరు 04 వరకు

తేదీ	వారము	పగలు ఉత్సవం	రాత్రి ఉత్సవం
25-11-2016	శుక్రవారం	---	అంకురార్పణం
26-11-2016	శనివారం	ధ్వజారోహణం	చిన్నశేషవాహనం
27-11-2016	ఆదివారం	పెద్దశేషవాహనం	హంసవాహనం
28-11-2016	సోమవారం	ముత్యపుపందిరివాహనం	సింహవాహనం
29-11-2016	మంగళవారం	కల్పవృక్షవాహనం	హనుమద్వాహనం
30-11-2016	బుధవారం	పల్లకీ ఉత్సవం	గజవాహనం
01-12-2016	గురువారం	సర్వభూపాలవాహనం	గరుడవాహనం
02-12-2016	శుక్రవారం	సూర్యప్రభవాహనం	చంద్రప్రభవాహనం
03-12-2016	శనివారం	రథోత్సవం	అశ్వవాహనం
04-12-2016	ఆదివారం	పంచమీతీర్థం	ధ్వజావరోహణం

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 47 అక్టోబరు, 2016 సంచిక : 05



వేంకటాద్రిసమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశసమో దేవో
న భూతో న భవిష్యతి ॥

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం & వెనుక చిత్రం : బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ వైభవం!

24 గంటలు పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

ఆనందమయం సప్తగిరీశుని బ్రహ్మోత్సవం

నిత్యాత్ముఁడైయుండి నిత్యుఁడై వెలుఁగొందు - సత్యాత్ముఁడైయుండి సత్యమై తానుండి
ప్రత్యక్షమైయుండి బ్రహ్మమైయుండు - సంస్తుత్యుఁడీ తిరువేంకటాద్రి విభుఁడు

అనంత మహిమాన్వితమై, కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో స్వయంవ్యక్తమై అర్చన లందుకొంటూ ఉన్న సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే శ్రీవేంకటేశ్వరస్వామి.

శ్రీవైకుంఠాన్ని వదలిపెట్టి అత్యంత భక్తవాత్సల్యంతో భువికి దిగివచ్చి ఈ వేంకటాచల శిఖరాలపై వక్షఃస్థల మహాలక్ష్మితో ఆవిర్భవించి 'కలౌ వేంకటనాయకః' అన్న ప్రసిద్ధితో 'ఇలలోని వేలుపుగా' 'ఇలువేలుపుగా' ఉంటూ అందరిని ఆదుకొంటూ ఉన్న స్వామి శ్రీవేంకటేశ్వరుడు.

భక్తవత్సలుడు ఆశ్రితరక్షకుడైన శ్రీస్వామివారిని కేవలం మానవులు మాత్రమేకాక బ్రహ్మాదిదేవతలు, ఋషిగణాలు, యక్షులు, కిన్నెర కింపురుషాది అనిమేషులు సైతం నిత్యము దర్శిస్తూ ఉంటారు. ఆరాధిస్తూ ఉంటారు. వారి వారి శక్తికొద్దీ ఆ కొండల రాయునికి ఉత్సవాలు చేస్తూ ఉంటారు. ఊరేగింపులు నిర్వహిస్తూ ఉంటారు. అందువల్లే ఏడుకొండలవాని సన్నిధిలో ప్రతిరోజు ఒక పండుగగా ప్రతిపూట ఒక పర్వంగా భాసిస్తూ ఉన్న ఈ వేంకటాచలక్షేత్రం **'నిత్యకల్యాణం-పచ్చతోరణం'**గా ప్రసిద్ధికెక్కి భక్తజన సందోహంతో కిటకిట లాడుతూ ఉంటుంది.

ఇలా, వెంకన్నకు ఎన్నెన్నో ఉత్సవాలు ఎన్నెన్నో ఊరేగింపులు జరిగినా సంవత్సరానికి ఒకమారు జరిగే బ్రహ్మోత్సవాలు మాత్రం తిరుమల చరిత్రలోనే అత్యంత అపూర్వమైనవి. ఈ దివ్యస్థలంలో శ్రీనివాసుడు ఆవిర్భవించి లోక కల్యాణం కోరి బ్రహ్మదేవుని చేత చేయించుకున్న మహోత్సవాలు ఇవి!

బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, శ్రీవారి సేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారి పర్యవేక్షణలో శ్రీసుదర్శన భగవానుల రక్షణలో సాగే అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని పదిరోజుల ఉత్సవాల్లో సర్వదేవతా సాన్నిధ్యం ఉట్టిపడుతూ తిరుమలక్షేత్రం అంతటా ఒక వినూత్న ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తూ ఉంటుంది.

మరి ఇలాంటి ఉత్సవాల్లో పాలుపంచుకొంటే చాలు జన్మధన్యమౌతుంది. ఏడుకొండలలో సంచరిస్తే చాలు జన్మజన్మల పాపాలు అన్నీ పోతాయి. "వెంకన్నా! నీవే దిక్కన్నా!" అని కీర్తిస్తే చాలు కోరికలన్నీ తీరుతాయి. 'గోవింద! గోవింద!' అంటూ అడుగులు ముందుకు వేస్తూ శరణాగతి చేస్తూ దర్శిస్తే చాలు, జన్మరాహిత్యమై ముక్తి కూడా కలుగుతుంది. మరి బయలుదేరి రండి! ఆ దేవదేవుని ముగ్ధమనోహర రూపాన్ని వివిధవాహనాల్లో కన్నులారా వీక్షిద్దాం!!


కానీ ఒక్కమాట మనం అందరం కూడ తిరుమలలో సంచరిస్తూ ఉన్నంతసేపు అడుగడుగున విధిగా నియ మాలను అనుసరిద్దాం. ఆ దివ్యక్షేత్ర పవిత్రతకు ఏ మాత్రం భంగం కలుగని రీతిలో త్రికరణశుద్ధిగా ఆక్షేత్ర సంప్ర దాయాలను పాటిద్దాం. పదినాళ్లపాటు జరిగే పరంధాముని బ్రహ్మోత్సవాల్లో పవిత్రంగా పాలుపంచుకొందాం.. నిత్య కల్యాణ చక్రవర్తి అయిన సప్తగిరీశుని అనుగ్రహానికి పాత్రులౌదాం.

త్రికరణశుద్ధిగా చేసిన పనులను - దేవుడు మెచ్చును లోకము మెచ్చును.

తిరుమలకు... నాలుగు నడక దోవలు

- శ్రీ బి.వి.రమణ, 97045 67641

తూర్పుకనుమలు-శేషాచలశిఖరాల్లో వెలసిన తిరుమలక్షేత్రం యుగయుగాలుగా భక్తజనుల కొంగు బంగారం! మహిమోపేతమైన పరమాత్మతత్త్వం!




కులమతాలు వర్గాలకు అతీతంగా తిరుమల శ్రీస్వామి దర్శనార్థం భక్తజనులు పోటెత్తుతూనే ఉన్నారు. వారిలో ఋషులు, యోగులు, సిద్ధపురుషులనుండి చక్రవర్తులు, కవులు, కళాకారులు, సామాన్యుల వరకు అన్ని రకాలవారు, శ్రీస్వామి చెంతకు చేరుకోవడానికి తహతహలాడుతూనే ఉన్నారు.

మునుపు ప్రధానంగా కాలినడకనే తిరుమలగిరులను అధిరోహించేవారు. దేశం నలుమూలల నుండి వచ్చే యాత్రికుల కోసం పూర్వం నాలుగు ముఖ్య మార్గలుండేవి. అది వరుసగా తిరుపతి నుండి తిరుమల బయల్దేరి వెళ్ళేవారికి 'అలిపిరి నుండి ఆనంద నిలయం దోవ', రెండోది శ్రీనివాసమంగాపురంనుండి ముందుకు సాగితే వచ్చే 'శ్రీవారిమెట్టు లేదా శ్రీపతివారిమెట్టు మెట్లమార్గం', మూడోది అటు కర్ణాటక ప్రాంతంనుండి వచ్చే వారికి వీలుగా భాకరాపేట - 'దేవరకొండ అరణ్య దోవ', ఇక నాల్గవది - కడపదిక్కు నుండి వెళ్ళేవాళ్ళకిగాను మామండూరు నుండి మొదలయ్యే 'స్వామి పాదాల దోవ' మార్గాల గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.....

1. అలిపిరి నుండి ఆనందనిలయానికి.....

శ్రీపార్థసారథిస్వామి సన్నిధి ప్రాంగణంలో గోవిందరాజస్వామి ప్రతిష్ఠాపన జరిగినప్పటి నుండి తిరుపతి ఒక ముఖ్యపట్టణమైంది. దాంతో ఊరు ప్రాముఖ్యత పెరిగింది. పల్లవ, చోళచక్రవర్తుల సామంతులైన యాదవరాజుల హయాంలో తిరుపతి పరిసరాల్లో గుళ్ళు, గోపురాలు, రాజమందిరాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో తిరుమలకు వెళ్ళే యాత్రీకులకు సౌకర్యాలూ మెరుగుపడ్డాయి. ఈ దృష్ట్యా అలిపిరి సోపానమార్గం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా విజయనగర చక్రవర్తి సాళువనరసింహరాయలు తిరుమల వైభవానికి చేసిన కృషి అనన్యం. సోపానమార్గంలో గుడిగోపురాలు కట్టించి తిరుమల ఆలయంలో పలు ఉత్సవాలు, సేవలు ప్రవేశపెట్టి అతడు కొత్త శకానికి నాంది పలికాడు.



అదే క్రమంలో నేటి కడపజిల్లాలోని సిద్ధవటం సీమను ఏలిన విజయ నగరరాజుల సామంతులైన మట్లిరాజులు తిరుమల యాత్రికులకోసం పలు నిర్మాణాలు చేపట్టారు. సోపాన మార్గాన్ని మరమ్మత్తు చేశారు.

నిజానికి అలిపిరి దోవ ఒక సాంస్కృతిక మేళా! రెండు కొండల నడుమ విచ్చుకున్న దారిలో ప్రయాణం సాగుతుంది. ఈ ఆరోహణాపర్వం ఆసాంతం దైవత్వ స్మృతులయానం! పడికట్ల నిండా లెక్కలేనన్ని రాతలు– అవన్నీ నాటిభక్త యాత్రికుల భావనలకు ప్రతీకలు. వాటిల్లో తమ ఊరు పేర్లతో కూడిన చిరునామాలే గాకుండా దైవనామ స్మరణలు, శాసనాలు, విగ్రహ, మండప నిర్మాణ వివరాలు... మొదలైనవెన్నో విశేషసంగతులు ఉండేవి.

మెట్లకు అటునిటు దేవతామూర్తులు, భక్తుల శిల్పాలు కనువిందు చేసేవి. ఇక ఆడేవాళ్ళు, పాడేవాళ్ళు, భజనలు చేసేవాళ్ళ గుంపులకయితే లెక్కేలేదు. అంతా ఆ భగవంతుడ్ని అందుకోడానికి సల్పే ధార్మికయత్నాలే.

*****

అలిపిరి

చక్కటి కొండశిఖరాలతో ఘనమైన గుడిగోపురాలతో, శిల్పశోభితమండ పాలతో అలరారే దైవధామమే అలిపిరి. అలిపిరి – తిరుమల పాదపీఠం! తిరుమల కొండకు వెళ్ళే దిగే ఘాట్‌రోడ్లకు, నడకదోవకు కూడలి.

అలిపిరిని తమిళంలో 'అడిపుళి' అని, 'అడిపడి' అనీ కొందరు పిలుస్తారు. 'అడి' అంటే తొలి, 'పడి' అంటే మెట్టు అని అర్థం. అడిపడి అంటే తొలిమెట్టు అని భావం. అలిపిరి అంటే అల్పశరీరి అనికూడా అర్థంగా చెబుతారు. శ్రీవేంకటేశ్వర స్వామి సూక్ష్మశరీరంతో భక్తులను అనుగ్రహిస్తూంటారట.

ఇక్కడి పాదాలమండపంలోని శ్రీస్వామివారి లోహపాదాలను భక్తులు నెత్తినిడుకుని భక్తితో గర్భగుడి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. పాదాలమండపం స్థానే పూర్వం ఉండిన ఓ చింతచెట్టు కింద భగవద్రామానుజులవారికి వారి మేనమామ తిరుమలనంబి రామాయణరహస్యాలు వివరించి చెప్పినారట. ఒకనాడు రామాయణ రహస్యాలు ఉపదేశించే క్రమంలో స్వామి అర్చనకు ఆలస్యంకావడంతో సాక్షాత్తు ఆ భగవంతుడే తన పాదచిహ్నాలను అక్కడ వదలి వెళ్ళాడని **'శ్రీ వేంకటాచల ఇతిహాసమాల'** పేర్కొంటోంది.

శ్రీస్వామివారి పాదద్వయం కలిగిన మండపాన్ని జీర్ణోద్ధా రణ చేసి 2001వ సం॥ ఆగస్టు 9న శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2016 సం॥ సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో

ఈ సంచికలోని ఫోటోలు అన్నీ ఫైల్ ఫోటోలు.

పాఠకులు గమనించ గలరు.

వైఖానస ఆగమరీత్యా సంప్రోక్షణ నిర్వహించారు. దాంతో పాదాలమండపం కాస్తా ఆలయరూపు సంతరించుకుంది. ప్రతి శుక్రవారం శ్రీస్వామి వారికి అభిషేకం, శనివారం విశేష పూజలు జరుగుతాయి.

మనోహర శిల్పశోభిత ఈ పాదాలమండపాన్ని విజయనగర చక్రవర్తుల సామంతుడు, మహాభక్తుడు మట్లకుమార అనంతరాజు 1628 సం॥లో నిర్మించాడు. ఈ మేరకు శాసనపాఠాన్ని కూడా మండపం కుడ్యంపై చూడవచ్చు.

పాదాలమండపం ముంగిట కొంచెం దిగువ శరణాగతి తత్త్వాన్ని ప్రతిబింబిస్తూ సాష్టాంగ దండప్రణామాన్ని ఆచరిస్తున్నట్లున్న ఓ శిలామూర్తి. కోలాల్ కొండయ్యన్ కుమారుడు తమ్మయ్యన్‌గా భావిస్తారు. బహుశ తమ్మయ్య ఇక్కడి గుడిగోపుర మండపాల శిల్పులలో ఒకడై ఉంటాడని ఊహ.

లక్ష్మీనారాయణ గుడి

పాదాలమండపానికి తూర్పున పశ్చిమాభిముఖంగా వెలసిన శ్రీలక్ష్మీ నారాయణగుడి వాస్తవానికి శ్రీలక్ష్మీనృసింహాలయం. మూలవిగ్రహాలను దొంగలెత్తు కెళ్ళారు. తిరుమల తిరుపతి దేవస్థానములవారు 2005 సం॥లో లక్ష్మీనారాయణ స్వామిని ప్రతిష్ఠించారు. పాతగుడి సాళువ నరసింహరాయల నిర్మాణం. ఈ గుడి పైకప్పునకు లేపాక్షిలోలాగా విజయనగర కాలంనాటి పౌరాణిక చిత్రకళ ఉండేది. కాలక్రమేణ కనుమరుగయ్యింది.

ఆ తరువాత మెట్లెక్కుతూనే తారసపడేది అఖండ శిల్ప శోభిత పెద్దగోపురం లేదా మహారాజగోపురం లేక పెరియగోపురం. ఆకసమెత్తు ఈ గోపుర నిర్మాత సాళువ నరసింహరాయలు.

ఈ పెరియగోపురం దాటుతూనే ఎడమపక్క దశావతారాల్లో ఒకరైన మత్స్యావతార మహావిష్ణువు. మెట్లమార్గంలో అక్కడక్కడా కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, రామ, బలరామ, శ్రీకృష్ణ, కల్కి విగ్రహమూర్తులను ప్రతిష్ఠించారు.

తలయేరుగుండు

వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమయ్య సైతం ఈ తలయేరుగుండును తాకి పరవశుడయ్యాడు. దీనికే 'తలతాకిడిగుండు' అని పేరు. ఇదో స్వస్థతాశిల, ఆరోగ్యచిహ్నం. కొండమెట్లెక్కి దిగే యాత్రికులు తమ కాళ్ళనొప్పులు, తలనొప్పులు పోగొట్టుకోవడానికి ఆయా అంగాలను దీనికేసి పాముతారు. దాంతో నొప్పులన్నీ మటుమాయం అవుతాయని నమ్మకం.



పాదాలమండపం పక్కన మెట్లు ఎక్కుతూనే కనిపించే మహారాజ గోపురం





తలయేరుగుండు



క్రమంగా కొండమెట్లెక్కుతూంటే మొక్కుడు మండపం, కొత్తగోపురం కానవస్తాయి. కొత్తగోపురం కూడా మట్లకుమార అనంతుడి చలవే. తన తల్లిదండ్రుల స్మారకార్థం ఆయన గోపురనిర్మాణం గావించాడు. దోవలో అటునిటు ఆంజనేయ స్వామి విగ్రహాలను భక్తులు కొలవడం కనిపిస్తుంది.

రాజుల మండపం, సగం ఎక్కుళ్ళు, ఎలక్కాయ మండపం, డబ్బారేకుల మండపం, మరో పాదాల మండపం... మొదలైనవన్నీ తారసపడతాయి. వీటన్నింటిని చూసుకుంటూ మెట్లవరుసల్ని అధిరోహిస్తే కనిపించేది గాలిగోపురం.

ఈ గాలిగోపురం రాత్రివేళ శ్రీస్వామి తిరునామాలు ధరించి విద్యుత్ కాంతులతో ధగధగలాడుతూ దూరం నుండి చూసే వాళ్ళకు కనువిందు చేస్తూంటుంది.

రాష్ట్రదేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని 'గాలిగోపురమఠం'వారి ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణసమేత ఆంజనేయస్వామివారి పాలరాతి విగ్రహాలను దర్శించవచ్చు.

తిరుమలకు ఘాట్‌రోడ్డు పడక మునుపు నడవలేని యాత్రికులను డోలీల్లో మోసుకెళ్ళేవారని తెలిస్తే మనకు ఆశ్చర్యం కలుగక మానదు.

ఇక్కడే కాలినడకన వచ్చే యాత్రికులకు దర్శనభాగ్యం కల్పించే బయోమెట్రిక్ వేలిముద్ర కేంద్రం, ఉచిత ప్రసాద వితరణకేంద్రాలు ఉన్నాయి. గాలిగోపురం దాటుకుంటూనే మెట్లవరస వారగా కొంచెంలోపలికి 'అల్లిదొన' అనే ఒక జలకుండం. మునుపు అది నీటినిల్వకేంద్రం.

చిట్టెక్కుడు, పూరేళ్ళ మండపం, మామండూరు మిట్టల మీదుగా నడిస్తే జింకలపార్కు కానవస్తుంది. యాత్రికులకు ఆహ్లాదాన్ని, ఉల్లాసాన్ని కలిగించేందుకు ఈ ఏర్పాటు చేశారు. ఈ పార్కులో 200 దాకా కణుతులు, జింకలు, కొండగొర్రెలు నివసిస్తున్నాయి.

7వ మైలు

అటు కొండదిగివచ్చే ఘాట్‌రోడ్డు, ఇటు అలిపిరి నడకదోవల కూడలి స్థానం. ఇక్కడ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి భారీ విగ్రహం ఉంది. హనుమజ్జయంతికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరుగుతాయి.

అటుతర్వాత కొత్త మండపం, పాత మండపం, ముగ్గుబావి... ముగ్గుబావి గట్టున శ్రీదాస ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు. ఇది హాథీరాంజీమఠం వారి ఆధ్వర్యంలోని ఆలయం. అలసటగా ఉన్నవారు పతంజలి వనవిశ్రాంతి కేంద్రంలో కాస్సేపాగి బయల్దేరవచ్చు.



లక్ష్మీనృసింహాలయం! ఇదీ సాళువ నరసింహన్నృపతి హయాంలో నిర్మితమైన ఆలయమే. గర్భగుడికి వెనుక ఎర్ర చందనం దారువులో యోగనృసింహస్వామి కొలువై ఉండడం ఇక్కడి ప్రత్యేకత.

లక్ష్మీనృసింహాలయం దాటి కిందకు కాసిన్ని మెట్లు దిగితే మొదటి ఘాట్‌రోడ్డు తగుల్తుంది. 1944లో అత్యంత ప్రయాసతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. ఘాట్‌రోడ్డు ప్రక్కనే పూర్వ కాలపు మెట్లమార్గాన్ని, 'అన్నమయ్య మార్గం' పేరిట ఈ మధ్య పునరుద్ధరించారు. అయితే యాత్రికులు దానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వక అలవాటుగా ఘాట్‌రోడ్డు మార్గాన్నే కొద్దిదూరం అనుసరిస్తున్నారు.

అవ్వాచారికోన అనే ఓ హరిత అగాథ ప్రాంతాన్ని అనుసరించి సాగే ఈ దోవలో 'అక్కగార్లు' అనే చిన్నపాటి గుడి ద్యోతకమౌతుంది. అక్కగార్లు ఏడుగురు. ఇటుకల రూపంలో పూజలందుకుంటూంటారు. మునుపు అవ్వాచారికోనలోకి కడ కంటా దిగి పైకి ఎక్కాల్సివుండేది. ప్రస్తుతం ఆ ప్రయాస తప్పింది.

మోకాలిమెట్టు

అక్కగార్ల గుడినుండి ముందుకు సాగి కుడిపక్కకు మలుపు తిరిగితే కనుచూపుమేరలో మోకాలిమెట్టు సుందర గోపురం. గోపురద్వారం నుండి దారితీసే పడికట్లు అలానే పైకి వెళ్ళి **'శ్రీభాష్యకార్లు'** అనే రామానుజులవారి సన్నిధికి చేరుస్తాయి.

అక్కడ్నుంచి తిరుమల ఇక ఎంతో దూరం ఉండదు. మోకాలిమెట్టు పాతమండపం, సారెపెట్లు, దేశాంతరిమండపాలు దాటుకొని తిరుమలకొండ చేరుకుంటాం. ఈ సందర్భంగా మోకాలిమెట్టు నుండి తిరుమల వరకు మెట్లమార్గానికి ఇరువైపులా వైష్ణవభక్త శిఖామణులైన ఆళ్వారుల విగ్రహాలు మనలో భక్తిభావనలు రేకెత్తిస్తాయి.

సుమారు 3500 మెట్లు ఎక్కితే మొత్తంమీద అలిపిరి నుండి ఆనందనిలయుడి చెంతకు చేరుకుంటాం. ఇక స్వామి దర్శనం అనేది మరో బృహత్తరకార్యం.

2. శ్రీవారిమెట్టుమార్గం

పూర్వం రాజులకాలంలో చంద్రగిరి నుండి శ్రీనివాస మంగాపురం మీదుగా శ్రీవారిమెట్టుమార్గం చాలా ప్రాచుర్యంలో ఉండేది. తన వివాహానంతరం ఈ మార్గంగుండానే సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి తన దేవేరి పద్మావతీదేవితో కలిసి తిరుమల కొండను అధిరోహించాడు.

ఆ కాలంలో రాజులు, చక్రవర్తులు, దండనాథులు, కవులు, కళాకారులు, దేవదాసీలు శ్రీవారిమెట్టు పడికట్ల మీదుగానే వెళ్ళి శ్రీస్వామి సన్నిధి చేరుకొనేవారు. బ్రిటిషు అధికారులు సైతం ఎప్పుడైన తిరుమల వెళ్ళాల్సి వస్తే ఈ దోవనే అనుసరించేవారు.

దూరప్రాంతాలనుండి వచ్చే భక్తయాత్రీకులకోసం మెట్లమార్గంలో అక్కడక్కడ దేశాంతరిమండపాలు ఉండేవి. స్వర్ణముఖిమండపం, చావడి, వండామండపం, గురురాజ మండపం, అంజనాద్రి కోనేటి మండపం, పత్తిరోళ్ల మండపం, రెండో పాదాల ఊట్ల మండపం మొదలైనవి యాత్రీకుల మజిలీ కేంద్రాలు. శాసనాల్లో సిద్ధకుట్టిగా పేరుబడసిన శ్రీనివాస మంగాపురం నుండి శ్రీవారిమెట్టుకు దూరం సుమారు 5 కి.మీ. తిరుపతి నుండి శ్రీవారిమెట్టుకు తి.తి.దేవస్థానాల వారి ఉచిత బస్సుసౌకర్యం ఉంది.

శ్రీవారిమెట్టు పాదపీఠాన నృసింహస్వామిగుడి, పెద్ద దిగుడుబావి ఉన్నాయి. నృసింహస్వామికోవెల శిథిలమైవుండగా ఈ మధ్యే తి.తి.దే.వారు దాన్ని శుభ్రం చేశారు. ఈ గుడి ఏకశిలా ధ్వజస్తంభాన్ని తిరుమలకొండపై టోల్‌గేటు ముందు చూడవచ్చు.


శ్రీనృసింహస్వామి గుడి


శ్రీవారిమెట్టు మార్గం

శ్రీవారిమెట్టు పడికట్ల ప్రారంభ ప్రదేశంవద్ద శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని తి.తి.దేవస్థానం వారు నిర్మించారు. శ్రీ స్వామిని దర్శనం చేసుకుని మెట్లు అధిరోహించడం ఓ ఆనవాయితీ. తిరుమలకు దారితీసే శ్రీవారిమెట్టు మార్గం కొంచెం నిటారైనప్పటికీ దూరం తక్కువ. అందుకే ఈ మధ్య చాలామంది యాత్రీకులు అలిపిరిని కాక ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దాంతో రద్దీ పెరిగింది.

విజయనగరచక్రవర్తి సాళువనరసింహరాయల గురువు వ్యాసరాయలవారు. ఒకానొక సందర్భాన 12 ఏండ్లపాటు తిరుమల ఆలయ అర్చావిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరాయలవారు తన శిష్యులతో ఈ మార్గం గుండానే తిరుమలకెళ్ళి పూజాదికాలు నిర్వర్తించారు.

మొదట్లో ఎగుడుదిగుడుగావున్న పురాతన మెట్లను సరిచేసి తి.తి.దే వారు 2006 సం॥లో కొత్తరాళ్ళను పరిచారు. దాంతో మెట్లదోవ ఓ క్రమపద్ధతి సంతరించుకుంది. అట్లే ఎండావానలనుండి యాత్రీకులకు రక్షణకై మెట్లదారిపై రేకులతో పైకప్పు పరిచారు. ఒకానొకప్పుడు తిరుమలలో నీటి ఎద్దడి ఉద్ధృతం కావడంతో కల్యాణీడ్యామ్ నుండి నీటిని తోడేందుకు ఓ పంప్‌హౌస్‌ను తి.తి.దే ప్రారంభించింది. 'కల్యాణిగంగ' పేరిట నీరు తిరుమల కొండకు చేరుకుంటోంది.

గుండెనిండా భక్తితో, ప్రకృతిపై అనురక్తితో శ్రీస్వామివారి పాదద్వయాన్ని నమస్కరించి శ్రీస్వామివారి ఆలయంనుండి నడక



శ్రీవారిమెట్టు మార్గంలోని దృశ్యం

మొదలెడితే 'గురప్పచింతల నారవ' తగుల్తుంది. విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఓ గుర్రం పరిగెత్తు కుంటూ వచ్చి ఇక్కడే ప్రాణాలు విడిచిందట. దాపులనే ఉండే దాని సమాధిని సైతం నిధులుంటాయేమో అనే ఆశతో దుండగులు తవ్వేశారు.

దాన్ని దాటుతూనే 'కోడికూతల బావి'. అక్కడ బావి అవశేషాలు అణుమాత్రం కూడా లేవు పూడ్చేసారు. 'కొక్కో రకో! కొక్కోరకో! అనే అడవి కోళ్ళ కూతలకు మాత్రం కొదవ లేదు. దోవ పొడవునా 'పారాహుషార్' అంటూ అప్రమత్తం చేస్తుంటాయి. మునుపు ఈ ప్రదేశంలో చిరుతపులులు, కణుతులు, దుప్పులు నిర్ణీత వేళల్లో అటునిటు దాటడం జరిగేది. బెట్టుడతలు ఎక్కువ.

ఇంకొన్ని మెట్లెక్కితే 'పత్రోళ్ళ మండపం' తగుల్తుంది. నిజానికిది విజయనగర రాజుల కాలంనాటి మండపం. నిండా శంఖుచక్రాలతోబాటు, ధ్యాన పురుషులు, దేవతా శిల్పాలు చెక్కి ఉన్నాయి. మండపం లోపల ఇరువైపులావున్న రాతి తిన్నెలు ఎందరు భక్తులకు విశ్రాంతి నొసగాయో!

ఇక్కడ్నుంచి బయల్దేరి శ్వాస ఎగబీలుస్తూ 'చిన్న ఊట్ల నారవ' దాటి, 'రాయలమండపం' గెంతి, 'ఊట్లమండపం' అనే రమణీయ స్థలాన్ని చేరుకుంటాం. నిజానికిక్కడ ఓ మండపం ఉండేది. అది శిథిలమైపోయింది. దాపులనే గల ఏడుగురు అక్కగార్లను భక్తులు పూజిస్తూంటారు. ఇది శ్రీవారి మెట్టు - తిరుమలకి నడిబొడ్డు. ఇక్కడ్నుంచి తలెత్తి చూస్తే పచ్చటి కొండలు కళకళలాడుతూ మనల్ని పైపైకి రమ్మని ఆహ్వానిస్తుంటాయి. పక్కనే పారే సెలయేటి తియ్యటి జలం మనం పడిన అలసటకి తెరపినిచ్చే అమృతోదకం.

మలుపులోనే శ్రీస్వామి పాదాలు. కరాలు మోడ్చి శ్రీ స్వామిచరణారవిందాలకు మ్రొక్కి భక్తి వివశత్వంతో గబగబా పైపైకి పోతే 'భాష్యకారుల గుడి'. అందులో నఖశిఖ పర్యంతం స్వామి ప్రత్యక్షం. గతి తప్పిన మనసు, అలివికాని ఆనందంతో పరిభ్రమిస్తే చుట్టూ కొండలు, కోనలు, లోయలు, చెట్టుచేమలు, సెలయేళ్ళు, పక్షులు, ఆకాశం అంచులు. అంతా అరణ్య ప్రకృతి. పంచభూతాత్మక సమ్మోహనా కృతి.

అంతా దేవుడు చూపిన త్రోవ. పరమాత్ముడి పద సన్నిధి. జీవిత పరమార్థాన్ని పరిగ్రహించడానికి జీవుడు పడే తపనే సాధన. తనలోని అజ్ఞానాంధకారాన్ని ఖండించ డానికా అన్నట్లు ఓరాతి ఫలకంపై శ్రీవారి సుదర్శన చక్రం. దాపులనే పూరించమన్నట్లుగా సహజ శిలాకృత శంఖం.



శ్రీవారిమెట్టు మార్గంలోని రమణీయ దృశ్యం



మార్గంలోని భాకరాపేట కనుమగుండా బయ ల్దేరి తిరుమల చేరుకునేవారు. భాకరాపేట సమీపాన నెమిలిగుండ్లు అనే చిన్నిగుట్టపై వెలసిన బాలవేంకటేశ్వరాలయంలో రాత్రిళ్ళు నిద్ర చేసి, ఉదయాన్నే చిట్టేచెర్ల –దేవరకొండ మార్గాన్ని పట్టుకుని శ్యామకోన అటవీ ప్రాంతంలోకి ఏతెంచేవారు.

వేంకటేశుడు ప్రేయసి బీబీనాంచారిని తీసుకుని భాకరాపేట అడవులగుండా పరిగెత్త సాగాడు. ఈ ప్రేమజంటని వెంటాడుతూ నవాబు సైనిక పటాలం. అలసి సొలసి కాసేపు విశ్రాంతికై ఓ కొండనెక్కారు ప్రేయసీప్రియులు. బూబమ్మను వంటకు పొయ్యి సిద్ధంచేయ మని చెప్పి తాను గాలంపట్టుకుని దాపులగల చెరువులో చేపల వేటకు వెడతాడు వెంకటేశుడు. గాలంకి చిక్కిన చేపను పైకి లాగబోతున్న తరుణంలో నవాబు సేనల అరుపులు కేకలు వినవస్తాయి. అంతే! గాలాన్ని పైకి విసరి ఒక్క ఉదటున లేచి పరుగెత్తిపోయి బీబీనాంచారి చేయి పట్టుకుని లాక్కెళుతూ ఒక బిలంలో దూరి తిరుమల కొండ వైపు వెళ్ళి అదృశ్యమైపోతాడు వెంకటేశ్వరుడు. దేవ దేవుడైన శ్రీస్వామి పరుగులు పెట్టిన కొండ దేవునికొండగా– దేవరకొండగా పేరుబడసింది.

ఇటీవలే అక్కడి వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని పునరుద్ధరించారు. నిత్యపూజలతో బాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

దేవేరీలతో శిలకు శోభనిస్తూ, భక్తులను అనుగ్రహి స్తున్న శ్రీవేంకటేశ్వరస్వామిని ఆ ప్రక్కనే సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాములవారిని దర్శించుకుని ఎగువకు ఎగసి, 'నూరు మెట్లు' దాటగానే తిరుమల టి.బి.గార్డెన్స్‌లోని సమున్నత శిల్పశోభిత రాతిరథం మనకు స్వాగతం పలుకు తుంది. మనలోని 'అంతర్ యాత్రారోహణ'కు ప్రతీక శ్రీవారి మెట్టు ప్రయాణం.

దిగువ తొలిమెట్టు ఎక్కేటప్పుడే 'చిత్తం'ను విడిచి పెట్టాలి. 'హృదయం'తో అధిరోహించాలి. అంతిమంగా 'ఆత్మ'తో దైవానుసంధానం సాధించాలి. ఆ శేషశైలవాసుడు చెప్పే సూత్రమిదే! మన మహామునులు, ఋషులు బోధించిన సత్యసారమూ ఇదే! ఇక శ్రీవారిమెట్టు యాత్రకు సిద్ధంకండి!

3. దేవరకొండ దోవ

కర్ణాటక ప్రాంతంవారికి తిరుమలస్వామి–తిమ్మప్పగా ప్రసిద్ధి. తిమ్మప్ప దర్శనార్థం వచ్చే భక్తయాత్రీకులు పీలేరు







దేవరకొండ నుండి బయల్దేరితే అంతా దట్టమైన అరణ్యం. దోవలో సద్దికూళ్ళబండ, పులిబోనుబావి, శ్యామకోన అనే స్వామికోన తారసపడ తాయి. తిరుమల కొండకు పశ్చిమ దిక్కునగల ఈ మార్గం పూర్వం పెద్ద పులులకు ప్రసిద్ధి. వేటకథల రచయిత కెన్నెత్ ఆండర్సన్ ఈ ప్రాంతంలో మనిషిమాంసం రుచి మరిగిన ఓ నరభక్షకి పెద్దపులిని వేటాడాడు. ప్రస్తుతం ఇది రక్షితాటవి. శ్రీ వేంకటేశ్వర అభయారణ్యం పరిధిలోనిది.

ఈ అరణ్యంలో దొంగలభయం కూడా ఎక్కువ కాబట్టి యాత్రీకులు గుంపులుగుంపులుగా ప్రయాణించేవారు. 'నాంచారమ్మ చెరువు', 'తిరుమల బండలు', 'టెంకాయనెట్టు' దోవగుండా మరలా కొండపైకి ఎగబాకాలి. 'దున్నపోతులపెంట', 'గంగ్రంగుల గుండు' తదితర ప్రదేశాలను దాటి తిరుమల వేదపాఠశాల సమీపానికి చేరుకుంటాం. ఇక కనుచూపుమేరలో కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ శ్రీనివాసప్రభువు నిలయమైన తిరుమలక్షేత్రం.

దేవరకొండ, స్వామిపాదాలదోవ మార్గాలలో అడవి ఏనుగుల బెడద ఉంది. యాత్రికులు తగిన జాగ్రత్తలతో ఉండాలి.

4. స్వామిపాదాలదోవ

కడపజిల్లా మీదుగా తిరుమల చేరుకోవాలనుకునేవారు బాలపల్లె– మామండూరు మార్గమధ్యంలోని **'స్వామిపాదాల దోవ'**ను ఎంచుకునేవారు.

స్వామిపాదాలు అని పేరు రావడానికి అక్కడి కొండదోవ మొగుదాలలో 'శ్రీస్వామిశిలాపాదాలు' ప్రతిష్ఠితమై ఉండేవి. అయితే ఇప్పుడు ఆ పాదాలు నిధుల తవ్వకంగాళ్ళ చేతిలో ముక్కలుచెక్కలయిపోయాయి. ఈ మార్గాన్నే కొందరు 'అన్నమయ్యమార్గం'గా కూడా ఇటీవల ప్రచారం చేస్తున్నారు.

మునుపు కడపప్రాంత శేషాచల సానువుల పర్యంతం శ్రీ శ్రీనివాస ప్రభువు సామ్రాజ్యంగా ప్రతీతి. ఆ దేవదేవుని పరగణాలోకి అడుగిడడానికి ఇదే ముఖద్వారం. ఓ గడప లాంటిది కాబట్టి దేవునిగడప కాస్తా **'దేవునికడప'**గా మారింది.

స్వామిపాదాల దోవ పూర్తిగా అడవిబాట. కాలి నడకే శరణ్యం. బ్రిటిషువారి హయాంలో పాలెగాళ్ళ ఆజమాయిషీలో ఉండేది.

పూర్వం స్వామిపాదాల ప్రారంభ ప్రదేశం వద్ద 'పెద్దన మండపం' పేరిట ఒక రాతికట్టడం ఉండేది. ప్రక్కనే చిన్న నీటి కోనేరు యాత్రీకుల దాహార్తి తీర్చడానికి ఉద్దేశించింది. ప్రస్తుతం అవన్నీ గతకాలపు స్మృతులు.



ఇక్కడ్నుంచి ఏటవాలుగా కొండను అధిరోహించాలి. దారిలో చింతమానుపెంట తారసపడుతుంది. ఒకప్పుడు పశువుల మందలు ఉండేవి. శ్రీవేంకటేశ్వరా అభయారణ్యం ప్రకటించాక పశువులదొడ్లను అధికారులు రక్షితారణ్యం

వెలుపలికి తరలించేశారు. అంతా అడవిబాట. చుట్టూ చెట్టుచేమలు, ముఖ్యంగా మోగిమానులు ఎక్కువ. నడుస్తూంటే పెద్దపెద్ద రాతిగుట్టలు రెండు కానవస్తాయి. వాటి పేరు 'అవ్వాతాత గుట్టలు'. ఆ దోవన పోయేవాళ్ళు తమ మొక్కులు, వేడికోళ్ళలో భాగంగా తలా ఓ రాయి ఆ గుట్టలపైకి విసరుతారు. అయినా జనాల కోర్కెల గుట్టలు తీర్చడానికి ఆ శ్రీనివాసుడికి ఎంత ప్రయాసో!

అన్నమయ్య స్వస్థలం రాజంపేట మండలం తాళ్ళపాకకు ఇది దగ్గరి దోవ. కాబట్టి అన్నమయ్య వంశీకులు ఈ మార్గంగుండానే తరచూ తిరుమలకు రాకపోకలు సాగించి ఉంటారని ఓ ఊహ.

శ్రీవేంకటేశ్వరుడు తను నివాసంగా ఉండడానికి అనువైన స్థలం వెదుక్కుంటూ గుర్రంపై ఈ అడవి తిరిగాడంట. అందుకు గుర్తుగా గుర్రం అడుగు.



శిథిలమైన సత్రాలు

శ్రీస్వామివారి గుర్రపుడెక్కల ఆనవాలును భక్తయాత్రీకులు పవిత్రంగా భావించి పూజిస్తుంటారు.

ఆ ప్రదేశాన్ని దాటుతూనే ఓ సువిశాల కోనేరు. అప్పటికి సముద్రమట్టానికి 1800ల అడుగులు ఎత్తుకు చేరుకుంటాం. సుదూరంగా తిరుమలకొండలు. ఇక్కడ్నుంచి బాట కాస్త సమతలం. కొద్దిదూరం నడువగానే నీలగిరిచెట్ల తోపు నడుమ 'ఎర్రిగుంటలు' అనే రసరమ్యప్రదేశం. మునుపు ఆ బాటలో వెళ్ళే యాత్రీకుల దాహార్తిని తీర్చే తటాకం. వన్యజీవాలకు అనుకూలం.

కొంచెం ఓపిక తెచ్చుకుని ముందుకేగితే 'ఈతకాయల మండపం'. ఓ ముసలిఅవ్వ స్వామి భక్తయాత్రీకుల విశ్రాంతి కోసం ఈతకాయలు అమ్మి ఆ సొమ్ముతో ఈ శిల్పశోభిత మండపం కట్టించిందట. నిజానికిది మట్లరాజుల నిర్మాణం. విజయనగర రాజుల కాలంనాటిది. ఎన్నో వందలేండ్లుగా ఈ బాట ప్రాచుర్యంలో ఉందనడానికి కొండగుర్తు. మండప స్తంభాలనిండా వివిధ దేవతామూర్తులు, ఆచార్యులు, భారత భాగవత సన్నివేశాలు. మధ్యలో సప్తగిరీశుడు కొలువైవున్న ఓ శిల్పం అమోఘం.

ఇక్కడ్నుంచి చూస్తే తిరుమల విహంగవీక్షణ దృశ్యం. పడికట్ల మార్గంగుండా దిగువకి దిగితే తిరుమల పాపవినాశనం రహదారి. గోగర్భం డ్యాం వెనుకకు చేరుకుంటాము. అంతటితో స్వామిపాదాలదోవ ద్వారా తిరుమల అరణ్యయాత్ర సంపూర్ణం. విశేషం ఏమిటంటే తిరుమలకొండ చేరుకోడానికి ఉపయోగపడే అన్ని ప్రధానదోవల మొగుదాలలో **'శ్రీ స్వామి చరణకమలాలు'** ప్రతిష్ఠితమై ఉండడం.

పాదాల పరమరహస్యాన్నేదో తెలుసుకొమ్మని ఉద్బోధిస్తున్నట్లుగా ఉంటాయి ఆ పాదద్వయం. పాదాలపరమార్థం అవగతమౌతున్న భావన కలుగుతుంది.

ఆధ్యాత్మిక ఔన్నత్యం అవగాహనకి నడకదోవలగుండా ప్రయాణించడం ఓ మార్గం!

ఓం నమో వేంకటేశాయ!

మాధవుపై లేని తలపులు పలు మేఘముల వికారములు



04

తిరుమల విశిష్టత

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

శ్రీనివాసునికి తిరుమలనంబి కైంకర్యం అమోఘం. తిరుమల నంబి భక్తిసేవాతత్పత్తపరతను గుర్తించిన స్వామి శుక్రవారాభిషేకానికి ఆకాశ గంగను సృష్టించి, గైకొనడం స్వామి భక్తపరాయణతకు నిదర్శనం. ఇదే కోవలో పూజనీయురాలు, మహాభక్తురాలు తరిగొండ వేంగమాంబ. ఈనాటికీ రాత్రిపూట స్వామివారి పవళింపుసేవలో చివరగా వేంగమాంబ ముత్యాలహారతితో రోజువారి కైంకర్యం పూర్తవడం విశేషం.

తరిగొండ వేంగమాంబ


ఆ తర్వాత చెప్పుకోవలసినవారు తరిగొండ వేంగమాంబ. తిరుమలలో ఆమె సమాధి ఇప్పటికీ ఉంది. ఆ సంగతి చాలామందికి తెలీదు. తరిగొండ అన్న ఊళ్ళో కృష్ణయ్య, మంగమ్మ అనేదంపతులకి ఐదుగురు కొడుకులు కలిగారు. కూతుళ్ళు లేరు. కూతురు పుట్టాలని వేంకటాచలం వెళ్ళి స్వామిని వేడుకోగా, ఆయన అనుగ్రహం చేత కూతురు పుట్టగా ఆమెకు వేంగమాంబ అని పేరు పెట్టారు. ఆమె చిన్నతనం నుండి వేంకటేశ్వరస్వామి భజననే చేసేది. చిన్నపిల్లకి ఉపవాసాలు, భజనలు ఏమిటని పెళ్ళి చేశారు. పెళ్ళి చేయగా, ఆమె రజస్వల కాక ముందే భర్త మరణించాడు. భర్త మరణించినా ఆమె ఐదవతనానికి సంబంధించిన సూచనలను విడిచి పెట్టలేదు. బొట్టు, పువ్వులు పెట్టుకుని ఆంజనేయస్వామి గుళ్ళో హారతులిచ్చేది.

సంప్రదాయవాదులకు ఇది నచ్చేదికాదు. సౌభాగ్యం కోల్పోయి ఆలయానికి రావడం నచ్చక ఒకరోజు పుష్పగిరి పీఠాధిపతులు అక్కడికి రాగా, తరిగొండ వేంగమాంబను ఆయన వద్దకు తీసుకెళ్ళి, అయ్యా! ఈవిడ భర్త చనిపోయి నప్పటికీ పసుపుకుంకుమలతో, పువ్వులతో తిరుగుతున్నదని చెప్పారు.

ఆమె పళ్ళు పట్టుకెళ్ళి పుష్పగిరి పీఠాధిపతికి సమర్పించింది. అప్పుడు వారు వేంగమాంబా! సౌభాగ్యవతిగా సమాజంలో తిరుగుతున్నావట నిజమేనా? అని అడగ్గా, అందులకు వేంగమాంబ అవును స్వామీ అని సమాధానమిచ్చింది. నీ భర్త మరణించాడు గదా అని అడగ్గా, నా భర్త వేంకటాధిపతి. నాది తరగని సౌభాగ్యమని సమాధానమిచ్చింది. అంతమాట అనడం చాలా గొప్ప విషయమే కానీ నేను పీఠాధిపతిని. నాకు నమస్కరించాలని తెలీదా? అని అడిగారు.

> **పుష్పగిరి పీఠాధిపతులు**
> **వేంగమాంబ తపశ్శక్తిని గుర్తించి,**
> **ఈమె సామాన్యురాలు కాదు.**
> **అపారమైన ప్రజ్ఞావంతురాలని అన్నారు.**

అందులకు ఆమె స్వామీ! నేను అలాగే మీకు నమస్కరిస్తాను కానీ మీరొక్కసారి ఆ పీఠంనుండి పైకి లేవమని అడిగింది. పీఠాధిపతి పైకి లేచారు. ఆమె పీఠానికి నమస్కరించగానే ఆ పీఠం అగ్నిహోత్రంలో భస్మమైపోయింది. పుష్పగిరి పీఠాధిపతులు వేంగమాంబ తపశ్శక్తిని గుర్తించి, ఈమె సామాన్యురాలు కాదు, అపారమైన ప్రజ్ఞాధురీణ. కాబట్టి ఈమెకి దేవాలయంలోనికి రావడానికి ఏ విధమైన అభ్యంతరాలు పెట్టకండి అన్నారు. అయినా, అర్చకులు ఆమెను దేవాలయంలోనికి వస్తున్నదని ఈడ్చేసారు. అర్చకులు ఆమెతో ఎందుకు ఈ గుళ్ళో ఉంటావు, వేరొకచోటికి పోకూడదా? అని అన్నారు.



తరిగొండ వేంగమాంబ

భగవదాజ్ఞ అనుకుని అరణ్యమార్గం పట్టి తిరుమల వెళ్లింది. ప్రతిరోజూ స్వామి ఏకాంతసేవ జరిగిన తర్వాత వేంగమాంబ **ముత్యాలహారతి** ఇచ్చేది. ఇప్పటికీ వేంకటాద్రిలో ఆమె పేరుమీద **ముత్యాలహారతి** ఇస్తుంటారు. తులసీవనం ఏర్పాటు చెయ్యడానికి పాపవినాశనం వెళ్ళే మార్గంలో ఒక నుయ్యి తవ్వించేటపుడు పెద్దబండ పడగా ఆమె గంగమ్మని ప్రార్థించింది. బండ చిట్లిపోయి నీరు పైకి వచ్చింది. తులసీవనం పెంచి ప్రతిరోజూ ఆ తులసిని తెచ్చి వేంకటేశ్వరస్వామికి కైంకర్యం చేసేది. వంశపారంపర్యంగా వచ్చేవారు కాకుండా ప్రభుత్వం తరపున అధికారులైన అర్చకులు అక్కరామదీక్షితులనే ఆయనకి వేంగమాంబ మీద ఆగ్రహముండేది. సౌభాగ్యం కోల్పోయిన స్త్రీ రోజూ వచ్చి ముత్యాలహారతి ఇవ్వడమేమిటి? అని అక్కసుగా ఉండేది. ఆవిడ భోజనం చేసి కూర్చున్న తరువాత వారి ఇంట్లో భోజనం చేసిన ఎంగిలివిస్తళ్ళు తులసీవనంలో విసురుతుండేవారు.

కొంతకాలం గడిచాక దర్శనం చేసుకుని వచ్చి కూర్చున్న వేంగమాంబమీదకి ఎంగిలివిస్తళ్ళు విసిరారు. ఆమె సమాధి భగ్నమైంది. అందులకామె కోపించి ఈనాటితో నీ వంశం సరి, అందరూ నెత్తురు కక్కుకుని మరణిస్తారని శపించింది. ఉత్తరక్షణం ప్రధానార్చకునితో సహా కుటుంబంలోని వారందరూ నెత్తురు కక్కుకున్నారు. ఒక్కకొడుకు మాత్రం పాక్కుంటూ వచ్చి వేంగమాంబ పాదాలమీద పడ్డాడు. అప్పుడామె మీ వంశంలో ఒక్కడు మాత్రమే బతుకు

ప్రతిరోజూ
శ్రీ వేంకటేశ్వరస్వామివారికి
ఏకాంతసేవ జరిగిన తర్వాత
వేంగమాంబ ముత్యాలహారతి ఇచ్చేది.
ఇప్పటికీ తిరుమలలో
ఆమె పేరుమీద
ముత్యాలహారతి
ఇవ్వబడుతోంది.

తుంటాడని అభయమిచ్చింది. ఇప్పటికీ ప్రభుత్వం తరపున ప్రధానార్చకుల కుటుంబాల్లో ఒక్కడు మాత్రమే బతుకుతుంటాడు. ఆనాడు వేంగమాంబ ఇచ్చిన శాపం ఇప్పటికి కూడా తిరుమలలో పరిపాలన చేస్తున్నది.

కొండకెళ్ళి ఆమె వ్రాసిన వేంకటాచలవైభవం అన్న పుస్తకం తీసుకుని ఇంటిలో పారాయణం గావించగా, పెళ్ళికానిపిల్లలకి పెళ్లిళ్ళయ్యాయి. ఆమె దర్శనానికి వెళ్ళేవారి సంఖ్య ఎక్కువై ఆమె ఏకాంతం తగ్గిపోయి, ఆమె వేంకటేశ్వరుని ప్రార్థన చేయగా, దూరంగా తుంబురుకోనలోకి వెళ్ళి తపస్సు చేసుకో మని చెప్పాడు. ఆమె ఎల్లప్పుడూ అంతర్ముఖురాలై ఉండేది. రాత్రివేళ సారంగపుమార్గంలో వచ్చి ఆనందనిలయం మూసే సిన తరువాత పీఠాన్ని పైకెత్తి స్వామి పాదాలవద్ద ఉన్న పువ్వులను తీసి కొత్త పుష్పాలతో పూజ చేసేది.

రోజూ పువ్వులు మారుతూండేవి. ఎవరు చేస్తు న్నారిదంతా అని అర్చకులకు అనుమానమొచ్చి, తిరుమల క్షేత్రాన్ని పాలించిన మహంతులలో ఒకరు, తలుపులు మూసిన తరువాత లోపలే కూర్చున్నారు. ఆ రాత్రివేళ తరిగొండ వేంగమాంబ దివ్యతేజో మూర్తియై ఫలకం తొలగించి లోపలికొచ్చి పూజ చెయ్యడం చూచి స్పృహతప్పి పడిపోయారు. ఆమె భాగవతం చెపుతుంటే వినడానికి స్వామి పవ శింపుసేవ అయ్యాక వచ్చేవారు. స్వామి ఉయ్యాలలో కూర్చుని వింటూండేవారు. ఈమె భాగవతం చెప్తూండగా, తెల్లవారుజామున మూడు గంటలకి సుప్రభాతం జరిగే సమయానికి స్వామి ఉయ్యాల దిగి, నేను వెళ్లొస్తాను వేంగమాంబా! అని వెళుతుండేవారు.

ఒకరోజు మంచిఘట్టం చదువుతూన్న సమయంలో స్వామి బయలుదేరుతూండగా, స్వామీ! మీరు వెళ్లొద్దు. నా దగ్గరే ఉండుమన్నది. నీలాగే ఎందరో భక్తులు. వారిని కూడా చూడాలి కదా! బయలుదేరుతున్నానన్నారు స్వామి. మీరు అలా వెళ్ళిపోవడానికి వీలులేదని నిగ్రహిస్తున్న సమయంలో సుప్రభాతం వినబడింది. వేంకటేశ్వరస్వామి ఒక్క ఉదుటున ఉయ్యాలలో నుండి అంతర్ధానమైపోదామని



అనుకుంటున్నంతలో ఆయన పట్టుపంచెని పట్టుకోగా, ఆ పంచె సగానికి చిరిగిపోయింది. స్వామి అంతర్ధానమై వెళ్ళిపోయారు.

అర్చకులు దేవాలయం తలుపులు తీసి *'కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే'* అంటూ సుప్ర భాతం చదివి లోపలకు వెళ్లగా, సగం చిరిగిన పట్టుపంచెతో కనిపించారు. ఇది దొంగతనంకాదు. ఎవరో భక్తులవలన జరిగింది. ఎవరై ఉంటారా అంటూ వేంగమాంబ ఇంట్లో చూడుమనగా అందరూ ఆమె ఇంటికెళ్ళారు. ఆమెని విచారించగా, స్వామిలేచి పారిపోతుండగా పట్టుకోగా సగం పంచె చిరిగి నా చేతిలో ఉండిపోయింది. మడతపెట్టి పూజా మందిరంలో పెట్టాను. తీసుకెళ్ళండి అన్నది ఆవిడ. లోపల పూజామందిరంలో ఉంది స్వామి పంచెలో సగభాగం. ఊరేగింపుగా తీసుకొని వస్తుంటే మిగిలిన సగభాగం అదృశ్యమై పోయింది. ఇవన్నీ యథార్థంగా జరిగాయి. ఆ తల్లి సమాధిలోకి వెళ్ళిపోయారు.

ఆదివరాహస్వామి వసతిసముదాయంవద్ద వెనుకగా చిన్నమార్గముంటుంది. ఆ మార్గంలో వెడితే తరిగొండ వేంగ మాంబ జూనియర్ కళాశాల అని ఓ పాఠశాల కనపడు తుంది. అక్కడ ఉంటుంది ఆమె సమాధి. అక్కడికెళ్లి ఆ సమాధికి సాష్టాంగనమస్కారం చేసి మౌనంగా ఒక్క నిమిషం కూర్చుని రావాలి. ఇప్పటికీ ఆమె శ్రీవేంకటేశ్వరస్వామికి అర్చన చేస్తూంటారని చెపుతారు.

(ఇంకా ఉంది)



బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

- ఎస్.వి.ఎస్.ఎస్.శర్మ 70959 27158

అక్టోబరు 2 నుండి 11 వరకు తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా.....



అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరునికి ఏడాది పొడవునా ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. 450కి పైగా ఉత్సవాలు జరిగేటప్పటికీ బ్రహ్మోత్సవాల ప్రత్యేకత వేరు. ఇప్పటికీ బ్రహ్మాది సకలదేవతలూ ఈ ఉత్సవాలలో పాల్గొంటారు. దీనిని తిలకించినవారికి శ్రీమన్నారాయణునితోపాటు సకలదేవతల అనుగ్రహం కూడా కలుగుతుంది. ఈ ఉత్సవాలు జరిగే 9 రోజులు మాత్రమే కాక వాటిలోని అంతరార్థాలను గ్రహించి నవద్వార పురమైన దేహంలో ఉండే జీవుడు అంతటా పరమాత్మను చూడగలిగి, పరమాత్మను పొందడానికి ఈ బ్రహ్మోత్సవాలు ఎలా సహకరిస్తాయో పరిశీలించవచ్చు.

అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం

అంకురార్పణ అంటే మొలకెత్తడానికి బీజములను నాటడం. జీవులందరూ కూడా పరమాత్మను పొందలేక జన్మ పరంపరలను పొందడానికి కర్మబీజాలు అనాది కాలంలోనే నాటబడ్డాయి. వేంకటేశ్వరుని సన్నిధిలో బీజాల అంకురార్పణ, దివ్యమైన పుణ్యకర్మలనే మొలకలెత్తి, చక్రస్నానముతో పరమాత్మునిలో లీనమయ్యే దిశగా జీవుల ఆధ్యాత్మిక సాధన సాగాలి.

పరమాత్మ మలయప్ప స్వామిగా శ్రీదేవీభూదేవేరులతో అనేక వాహనములపై మాడవీధులలో ఊరేగడం విశేషం. ఇక్కడ గమనార్హం - వాహనములు మారుతూ ఉన్నాయి కానీ పరమాత్మలో మార్పు లేదు. అట్లే జీవుల దేహాలు మారుతున్నాయి గానీ అంతర్యామి అయిన పరమాత్మలో మార్పు లేదు. ఈ దేహం పరమాత్ముని వాహనంగా గుర్తిస్తే చాలు జీవుడు ధన్యుడవుతాడు. జీవేంద్రియ సేనలు సక్రమంగా ఉండాలంటే సరైన సేనాధిపతికి అప్పజెప్పాలి. అప్పుడు బ్రతుకంతా ఉత్సవమే. అదే సేనాధిపతి ఉత్సవం.

ధ్వజారోహణం

శ్రీగరుడాళ్వారు వేంకటపతికి వాహనంగా మాత్రమే కాక, నిత్యసూరిగా స్వామి సేవలో అనునిత్యం పాలుపంచుకుంటాడు. ఆ గరుడచిహ్నాంగల ధ్వజాన్ని ధ్వజస్తంభం పైకి వేదఘోషల నడుమ ఎక్కించడమే ధ్వజారోహణం. తద్వారా గరుడుడు దేవతాదులందరినీ బ్రహ్మోత్సవములకు ఆహ్వానిస్తూ, ఆ స్తంభంపైనుండి ఉత్సవాలను తిలకిస్తున్న భక్తులను పర్యవేక్షిస్తూ, జీవులకు పరమాత్మనుండి దూరం చేసే దుర్విషయాలు ప్రవేశించకుండా రక్షకుడుగా వ్యవహరిస్తాడు.

అచ్యుతు వినని కథలు భువి గజస్నానములు

పెదశేషవాహనం

అనాదిగా క్షీరసాగరంలో శేషుని పానుపు చేసుకోవడమే కాక శేషాద్రిగా అతని అనంతశిరస్సులపైనే వేంకటేశ్వరునిగా నెలకొని ఉన్నానని చెప్పడమే ఈ వాహనములోని ఆంతర్యం.

అనంత శిరస్సులు జ్ఞానానికి సంకేతం. అవి విషములుగ్రక్కేటప్పటికీ పరమాత్మ అధిష్టించడం వలన అమృతమయమయ్యాయి. అంటే జీవుల మస్తిష్కంలో ఎంతటి విషపుతలపులు ఉన్నా, పరమాత్ముని ధ్యానిస్తే అవి అమృతమయమై జ్ఞానానందాన్ని కలుగజేస్తాయి.

చినశేషవాహనం

ఆదిశేషుడు అప్పుడప్పుడు "వాసుకి"ని కూడా స్వామి సేవలో వినియోగిస్తూ ఉంటాడు. అది స్వామివారి కరుణ. కశ్యప ప్రజాపతికి కద్రువయందు కలిగిన మొదటి సంతానం వాసుకి.

వాసుకి క్షీరసాగర మథన సమయంలో మందర పర్వత కవ్వపు త్రాడుగా అమృత ప్రాప్తికి సహకరించాడు. కనుక అమృతపద ప్రాప్తికి కూడా ఈ వాహన ధ్యానం సహకరిస్తుంది.

హంసవాహనం

స్వచ్ఛతకు మారుపేరు హంస. స్వచ్ఛంగానున్న హృదయ హంసపై పరమాత్మ నెలకొని ఉంటాడు. పాలనీ నీరుని వేరు చేసినట్లు, జీవుల పాపపుణ్యములను వేరుచేసి పరమాత్మకు నివేదిస్తుంది. నిత్యయోగ సంబంధమున్న పరమహంసల హృదయముపై అధిష్టించి ఉంటాడు పరమాత్మ. అన్నమయ్య పదములలో "మనియెడి జీవుల మానస సరసుల వునికి నున్న దిదె ఒక హంస" జీవుల మానస సరోవరములో ఆడుకునే హంస ఇది.

సింహవాహనం

"మృగాణాం చ మృగేంద్రోఽహం" మృగములలో శ్రేష్ఠమైన సింహము నారాయణుని రూపం. హింస అను పదమే సింహముగా మారినదని వ్యాకరణం. పరమాత్ముని అవతారములలో శిష్టజన రక్షణే కాక దుష్టశిక్షణ ప్రధానం. జీవులలో ఏ మాత్రం హింసా ప్రవృత్తులు మేల్కొనినా వాటికి అధిపతి ధర్మస్వరూపుడైన నారాయణుడని ఇందులోని పరమార్థం.

ముత్యాల పందిరి వాహనం

ముత్యములు స్వచ్ఛతకు, సంపదకు చిహ్నము. పరమాత్ముని కరుణారసభరితములైన చూపులనే స్వాతి చినుకులు అందుకోవడానికి మన హృదయమనే ముత్యపు చిప్పను స్వచ్ఛంగా, శుద్ధంగా చేసి సిద్ధంగా ఉంచాలి. ఇక్కడ విష్ణుసహస్ర నామాంతర్గతాధ్యానాన్ని పరిశీలించాలి.

క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణివిలసత్సైకతేమౌక్తికానాం
మాలాక్లుప్తాసనస్థః స్ఫటికమణినిభైర్మౌక్తికైర్మండితాంగః ।

తెల్లని పాలసముద్ర తీరంలో ముత్యములు, స్ఫటికముల పొడివలెనున్న ఇసుక తిన్నెలు. ఆ మధ్యలో ఒక విశాలమైన సింహాసనము. పై భాగం, క్రిందభాగం మొత్తం ముత్యముల, స్ఫటికముల మాలలతో అలంకరింపబడి ఉంది. ఆ సింహాసనముపై స్వచ్ఛమైన తెల్లని రంగుతో ప్రకాశిస్తున్న నారాయణుడు శరీరమంతా ముత్యపు ఆభరణములు ధరించి, మనలను పవిత్రులను చేయుగాక. ఈ ధ్యానం అమృతపద ప్రాప్తిని కలుగజేస్తుంది.

కల్పవృక్షవాహనం

"కల్పద్రుమూలే మణివేది మధ్యే సింహాసనం స్వర్ణమయం సురత్నం" కల్పవృక్షఛాయలో పరమాత్మ శ్రీదేవీ భూదేవీసహితంగా ప్రకాశిస్తూ ఉంటాడు. కోరిన కోర్కెలు తీర్చేది కల్పవృక్షం. కానీ, శ్రీవేంకటేశ్వర కల్పవృక్షం జీవులు అడుగక పోయినా ఏది జీవునికి మేలు కలిగిస్తిందో అది ఇస్తాడు. స్వామి కల్పవృక్షపు నీడలో మాత్రమే కాక దాని మూలము నందు అధివసించి ఉంటాడని అర్థం. కల్పవృక్షములకు మూలము ఆ పరమాత్మయే.

బ్రహ్మోత్సవ వాహనాల ఛాయాచిత్రాలను సంచిక మధ్యపుటల్లో ఇవ్వడం జరిగింది. పాఠకులు గమనించగలరు

సర్వభూపాలవాహనం

భూపాలురు అంటే పంచభూతములు, అష్టదిక్పాల కులు మొదలైన దేవతలు. దేవతలకు ప్రభువు కనుక స్వామి సర్వభూపాలురను అధిష్ఠించి ఉన్నాడు. దేవదేవుని శాసనము వలననే సర్వభూపాలురచేత ఈ ప్రపంచము నిర్వహింప బడుతోంది. అంతేకాక విష్ణువు అంశ లేనిదే పాలకులు కాలేరు. కానీ ఈ పాలకులందరూ తమ ప్రభువు విష్ణువేనన్న స్పృహతో ఉండి ధర్మబద్ధంగా పరిపాలించాలి.

మోహినీ అవతారం

"యా ఉమా సా స్వయం విష్ణుః" అని చెప్పినట్లు నారాయణుడు ధరించిన అమ్మవారి రూపం మోహినీ దేవత. క్షీరసాగర మథనమందు పుట్టిన అమృతమును పంచడానికి అవతరించినది. ఆమెను దేవతగా గుర్తించి నమస్కరించారు కనుక దేవతలు అమృతాన్ని పొందారు.

సాధారణ మోహినీరూపంగా చూడడం వలన రాక్షసులు మోహంలో పడి అమృతాన్ని పొందలేకపోయారు. భగవద్గీతలో చెప్పబడ్డ దైవీగుణములను పెంచుకున్నవారికే అమృతపదమైన కైవల్య ప్రాప్తి. ఆసురీ గుణములున్నవారు పొందలేరన్నది ఈ అవతారములోని విశేషం.

గరుడవాహనం

నిత్యము వాహన కైంకర్యముతో కొలుచుకునే గరుడునిపై ఊరేగుతాడు గరుడాద్రిపై నెలకొని ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి. గరుత్మంతుడు వేదస్వరూపుడు.

వేదములద్వారా ప్రతిపాద్యమైన పరబ్రహ్మ వేంకటేశ్వరుడని చెప్పడమే గరుడవాహనములోని విశేషం. అంతేకాక వైకుంఠము నుండి క్రీడాద్రిని తెచ్చి వేంకటాచలముగా చేసినవాడు గరుడుడు. విషహరుడు, అమృత కరుడు.

గరుడవాహన సమయంలో సిరివిల్లిపుత్తూరు ఆండాళ్ దేవాలయమునుండి పంపిన తులసి, చామంతి, సంపెంగ మొదలైన పూలమాలలతో స్వామివారిని అలంకరిస్తారు. అదేవిధంగా ప్రతిఏడాది సిరివిల్లిపుత్తూరులోని అమ్మవారి కల్యాణానికి శ్రీ వేంకటేశ్వరునికి అలంకరించిన మాల తీసి పంపబడుతుండడం విశేషం.

హనుమంతవాహనం

రామావతారంలో సుగ్రీవునితో మైత్రికై వెళ్ళినపుడు, యుద్ధభూమిలో రావణుని ఎదుర్కొనునపుడు రథమునకు ప్రతిగా హనుమంతుడు వాహనమయ్యాడు. భక్తాగ్రేసరులకు సైతం హనుమ ఆదర్శం. సాటిలేని బుద్ధిబలంతోపాటు అమిత బలపరాక్రమాలున్నప్పటికీ నిస్స్వార్థంగా వాటిని భగవంతునికే అర్పించిన మహోన్నతుడు హనుమ. ఎంతటి శక్తి ఉన్నా అది భగవంతుని సేవకు వినియోగింపబడినప్పుడే ధన్యత. భాగవత ధర్మంగా చెప్పబడిన నవవిధ భక్తులయొక్క సమష్టి రూపమే హనుమ.

స్వర్ణరథం

సువర్ణ ప్రభలతో వెలుగొందే శ్రీ వేంకటేశ్వర స్వామి బంగారు రథమెక్కి ఊరేగే దృశ్యం చూసేవారి కన్నులకు పండుగ. స్వర్ణరథ ప్రభలకంటే బంగారుస్వామి అయిన శ్రీవేంకటేశ్వరుని ప్రభలే అద్భుతంగా ఉంటాయి.

వైకుంఠపాళి

:: 11 - సమాధానాలు ::

	1 కు	2 ల	శే	3 ఖ	రా	4 ళ్వా	రు	
5 ఆ		చ్ఛి		గ		మా		6 గా
7 రా	ధ		8 శ్రీ	ప	తి		9 ఛా	య
మం		10 ప		తి		11 వి		త్రి
	12 టి	ట్టి	భం		13 క	లా	పి	
14 జా		సం		15 తా		సి		16 క్షే
17 య	దు		18 నా	ళ	ము		19 యా	త్ర
ప		20 చే		ధ్వ		21 ద్రి		య్య
	22 స్థా	వ	ర	జం	గ	మా	లు	

గజవాహనం

గజము ఐశ్వర్యానికి, శుభాలకు చిహ్నం. ఇది క్షీర సాగర మథన సమయంలో ఉద్భవించిన ఐరావతమనే గజమని చెప్పబడింది. గజవాహనంలో స్వామివారిని దర్శించడం ఐశ్వర్యప్రదం.

సూర్యప్రభవాహనం

"చక్షోః సూర్యోఽజాయత" పరమాత్ముని కన్నుల నుండి వచ్చినవాడు సూర్యుడు. అంటే పరమాత్ముని దృష్టి. రోజూ సూర్యుని చూస్తున్నాం కానీ ఆ సూర్యునిద్వారా పరమాత్మే మనలను చూస్తున్నాడు అనే స్పృహ ఉంటే జీవితం ధన్యం. "యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽ ఖిలం.." అని భగవద్గీతలో చెప్పినట్లు జగత్తును ప్రకాశింపజేయు చున్న సూర్యునిలోని కాంతి శ్రీవేంకటేశ్వరుడే.

చంద్రప్రభవాహనం

"చంద్రమా మనసో జాతః"–చంద్రుడు పరమాత్ముని మనసునుండి వచ్చినవాడని పురుషసూక్త వచనం. ఉదయం సూర్యునిగా జీవాన్ని ఇస్తూ, రాత్రి చంద్రునిగా తన అమృత కిరణాలతో ఓషధులను కలుగజేస్తూ ఆదుకుంటున్నాడు. రాత్రి, పగలు కూడా శ్రీవేంకటేశ్వరుని స్వరూపమే. ఈ విధంగా భావించిన భక్తుడు ధైర్యంగా ఉండగలడు.

రథోత్సవం

"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" రథముపై కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరుని చూసిన వారు మరి జన్మపరంపరలలో పడకుండా తరిస్తారనేది శాస్త్ర వచనం. పరమాత్మ ఈ జగత్తనే రథాన్ని వేదవిజ్ఞానమనే అశ్వములద్వారా నడుపుతున్నాడు.

అంతేకాక జీవుల దేహమే రథంగా ఉపనిషత్తులు వర్ణించాయి. "ఇంద్రియాణి హయాన్యాహుః" ఇంద్రియములే దేహమనే రథానికి గుఱ్ఱములు. లౌకిక విషయములకు ఆసక్తి చూపిస్తూ భ్రమాకర్షణల వైపు వెళ్ళే ఈ రథాన్ని స్వామిపై నిలిపితే కైవల్యాన్ని ప్రసాదిస్తాడు.

అశ్వవాహనం

ఈ అశ్వవాహనముపై వెళ్తూనే మొదటిగా పద్మావతిని చూడడం, వివాహ ప్రయత్నం అన్నీ జరిగాయి కనుక ఇది చాలా ప్రధానమైనది. ఇది క్షీరసాగరమథన సమయంలో పుట్టిన ఉచ్చైశ్రవమనే దివ్యాశ్వం. ఇది రాబోయే కల్కి అవతారాన్ని తెలియజేస్తుంది. ఇది దర్శించిన వారిలో కలి దోషాలు రాకుండా ఉంటాయి.

చక్రస్నానం

శ్రీ వేంకటేశ్వరుని కరకమలములో వేలకొలది జ్వాలలతో ప్రకాశించే సుదర్శన చక్రమునకు స్వామి పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. దీనికి ముందుగా శ్రీదేవీ భూదేవీ సమేత మలయప్ప స్వామివార్లకు, ఈ సుదర్శన చక్రత్తాళ్వార్లకు వేదమంత్రముల నడుమ అభిషేకం చేస్తారు.

సుదర్శనము ఒక దేవతామూర్తి. సు–దర్శనం అంటే జ్ఞాన స్వరూపమని కూడా అర్థం ఉంది. చక్రస్నానం అయిన తరువాత, దానిని ఒక ఎత్తైన ప్రదేశంలో ఉంచుతారు. భక్తులు దాని క్రిందనుండి వెళ్తారు.

ఆ సమయంలో స్నానసమయంలో చక్రానికి ఉన్న నీటిబిందువులు వారి పై పడడం వలన వారికి ఏమైనా దుష్టశక్తులు ఉంటే అవి పోవడమే కాక పాపములనుండి విముక్తులవుతారు.

ధ్వజ అవరోహణ

బ్రహ్మోత్సవాలని ప్రారంభంలో ఆరోహణ చేసిన గరుడధ్వజాన్ని వేదనాదముల మధ్య అవరోహణ అనగా క్రిందకు తెస్తారు. ఇది బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన దేవత లందరకూ వీడ్కోలు వంటిది.

ఈ తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాన్ని తిలకించడం వలన నారాయణుని సంపూర్ణ అనుగ్రహం లభిస్తుంది. ప్రతి వాహనసేవను ఇలా వివేచన చేస్తే జీవిత సాఫల్యం కూడా పొంద వచ్చు.



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

శ్రీవారి ఆర్జితసేవలు, తిరుమల.



ఆర్జితసేవలు / ఉత్సవాలు

సంఖ్య	సేవ/ ఉత్సవం	రోజు	ప్రవేశ / సేవాసమయం	వ్యక్తి ప్రవేశం	టిక్కెట్టు ధర
	నిత్యసేవలు				
1.	సుప్రభాతం	ప్రతిరోజు	ఉ.2-30 నుండి 3-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 120-00
2.	తోమాలసేవ(మంగళ,బుధ,గురు)	ప్రతిరోజు	ఉ.3-00 నుండి 3-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 220-00
3.	అర్చన (మంగళ, బుధ, గురు)	ప్రతిరోజు	ఉ.4-00 నుండి 4-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 220-00
	నిత్య ఉత్సవములు				
4.	కల్యాణోత్సవం	ప్రతిరోజు	మ.10-00 నుండి 12-00 గం॥	ఇద్దరికి మాత్రమే	రూ. 1,000-00
5.	డోలోత్సవం (ఊంజల్‌సేవ)	ప్రతిరోజు	మ.11-00 నుండి 1-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 200-00
6.	ఆర్జిత బ్రహ్మోత్సవం	ప్రతిరోజు	మ.12-30 నుండి 2-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 200-00
7.	వసంతోత్సవం	ప్రతిరోజు	మ.2-30 నుండి 3-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 300-00
8.	సహస్రదీపాలంకరణ సేవ	ప్రతిరోజు	సా.5-00 నుండి 5-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 200-00
	వారపుసేవలు				
9.	విశేషపూజ	సోమవారం	ఉ.6-00 నుండి 6-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 600-00
10.	అష్టదళ పాదపద్మారాధనం	మంగళవారం	ఉ.5-00 నుండి 5-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 1,250-00
11.	సహస్ర కలశాభిషేకం	బుధవారం	ఉ.5-00 నుండి 5-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 850-00
12.	తిరుప్పావడసేవ	గురువారం	ఉ.5-00 నుండి 5-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 850-00
13.	వస్త్రాలంకార సేవ	శుక్రవారం	ఉ.3-30 నుండి 4-00 గం॥	ఇద్దరికి(భార్య,భర్త)	రూ. 12,250-00
అ).	పూరాభిషేకం(12ఏళ్లలోపు పిల్లల్ని అనుమతించరు)	శుక్రవారం	ఉ.3-30 నుండి 4-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 750-00
14.	నిజపాదదర్శనం	శుక్రవారం	ఉ.5-00 నుండి 5-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 200-00
	వార్షికసేవలు /ప్రత్యేకసందర్భసేవలు				
15.	తెప్పోత్సవాలు	ఫిబ్రవరి/మార్చి	సా.6-00 నుండి 7-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 500-00
16.	వసంతోత్సవం	మార్చి/ఏప్రిల్	మ.1-00 నుండి 2-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 300-00
17.	పద్మావతిపరిణయం	మే	సా.4-00 నుండి 4-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 1,000-00
18.	అభిదేయకఅభిషేకం	జూన్	ఉ.8-00 గం॥లకు	ఒక్కరికి మాత్రమే	రూ. 400-00
19.	పుష్పపల్లకి	జూలై	సా.6-30 నుండి 7-30 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 200-00
20.	పవిత్రోత్సవం	ఆగష్టు	ఉ.8-00 నుండి 9-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 2,500-00
21.	పుష్పయాగం	నవంబరు	ఉ.8-00 నుండి 9-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 700-00
22.	కోయిలాళ్వార్‌తిరుమంజనం	సం॥లో 4 సార్లు	ఉ.10-00 నుండి 11-00 గం॥	ఒక్కరికి మాత్రమే	రూ. 300-00


కాల్‌సెంటర్ : 0877-2233333, 2277777
టోల్ ఫ్రీ : 1800 4254141,
1800 425333333
వాట్సప్ : 9399399399
ఈ-మెయిల్ : helpdesk@tirumala.org

పై సేవలకు సంబంధించి ఆన్‌లైన్‌లో మాత్రమే టిక్కెట్లు బుక్ చేసుకోవలసి ఉంటుంది.
ఇతర వివరాలకు తి.తి.దే.వెబ్‌సైట్: www.tirumala.org/ www.ttdsevaonline.com ను సంప్రదించగలరు.

కైంకర్యమే.. తనువు దాల్చితే....

6

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



(జరిగిన కథ - పరమప్రపూర్ణడైన శ్రీ కాంచీపూర్ణుల వృత్తాంతం వివరించబడుతూంది. కాంచీపూర్ణులు కంచి వరదరాజస్వామితో నేరుగా మాట్లాడే మహాత్ములు. ఈ నేపథ్యంలో సఖ్యభక్తి వైశిష్ట్యం వివరించడం జరిగింది. తదుపరి దాస్యభక్తి గురించి చదివి తరించండి.....)

శ్రీవైష్ణవ సిద్ధాంత ప్రవర్తకులైన ఆళ్వారులు అందరూ నవవిధ భక్తిమార్గాలలో దాస్యభక్తిని విశేషంగా పాటించారు. శ్రియఃపతిని తండ్రిగా, ప్రభువుగా, ఆచార్యునిగా సంభావించి దాసాను దాసులుగా భగవత్సేవలో తరించారు. ఆళ్వారులంటే ఏలువారు అని అర్థం. ఏలేవాడు సాధారణంగా రాజు అవుతాడు. లేదా దేవుడు అవుతాడు. భగవంతుడు ప్రత్యక్షంగా ఏలేవాడు కాదు. అందుకే భగవంతుని అంశలుగా ఆళ్వార్లు అవతరించి ఏలుతున్నారు. ఈ ఆళ్వారులు అనన్యమైన తమ అనురక్తిని విష్ణు పరంగా అనుభవించి, శ్రియఃపతితో ఆత్మీయమైన దివ్యాను భూతిని పొందుతూ మధురమైన భావాలతో స్తుతించారు.

'భక్తి' లో ఒక ప్రధానమైన భాగమే భగవంతుని స్తుతించడం. భగవంతుని మహిమలను, భక్తులపై చూపే వాత్సల్యాన్ని, కల్యాణగుణాలను ఆర్తితో స్తుతించడం వల్ల భక్తులకు పరమ శాంతి లభిస్తుంది. అందుకే భగవత్ స్తుతి భక్తునకు అత్యంతావశ్యకం. ఎంతో ఆనందరకరమైనదీ, అంతులేని సంతృప్తి దాయకమైనదీ అయిన స్తుతి సంప్రదాయం అందరినీ అమితంగా ఆకర్షించింది. స్తుతి చేయడం భాగవతుల సహజ లక్షణం. భగవంతుని కల్యాణగుణాలను స్తుతించడం ఒక తపస్సు. కాంచీపూర్ణులు కూడా ఇటువంటి తపశ్శాలియే. వీరు 'దేవరాజ' స్వామిని గురించి ఎనిమిది శ్లోకాల్ని అనుగ్రహించాచారు.

నమస్తే హస్తి శైలేశ । శ్రీమన్ । అంబుజలోచన।
శరణం త్వాం ప్రపన్నోఽ స్మి ప్రణతార్తి హరాచ్యుత ॥

"శ్రీహస్తి గిరినాథా! పెరున్దేవి తాయార్‌కు నాథుడైన వాడా! తామరలవంటి కన్నులును కలవాడా! దాసుల దుఃఖాలను తీర్చేవాడా! ఆశ్రితులను ఏనాడూ విడువని అచ్యుతా! నీకు నమస్కారం. నిన్ను శరణు పొందుతున్నాను".

'సహ ఏష పురుషః పంచధా పంచాత్మా' అనే శ్రుతి వాక్యాన్ని అనుసరించి పరమాత్మ స్వరూపం ఐదువిధాలుగా ఉంటుంది. ఈ స్వరూపాలను తెలుసుకోవడం ఒక దానిని మించి మరొకటి గహనమైనవి. పరస్వరూపం, వ్యూహ స్వరూపం, విభవ స్వరూపం, అన్తర్యామి స్వరూపం, అర్చావతార స్వరూపం అనేవి ఐదు స్వరూపాలు.

పరమపదంలోని పరంజ్యోతి స్వరూపమే 'పర'. సర్వ లోకపాలకుడు విష్ణువు. ఈయన వైకుంఠంలో నివసిస్తూ దిక్పాలాది దేవతల సహాయంతోనూ, స్వీయమహిమతోనూ సర్వలోక పాలన కొనసాగిస్తాడు. సమస్తదేవతల చేత సేవింపబడుతూ వెన్నుడు వైకుంఠంలో వాసం చేస్తున్న తీరును తెలియజేసేదే 'పర'. ఉపాసనార్థంపరుడు ధరించే రూపం 'వ్యూహం'. లోకోద్ధారణకోసం అవ తరించే పరమాత్మ అవతారలే 'విభవం'. నిరంతరం తనను ధ్యానించే మహర్షుల హృదయాల్లో విష్ణువు నివాసం చేస్తుండే స్థితే 'అంతర్యామి' స్వరూపం. భక్తుల్ని అనుగ్రహించడం కోసం దేవాలయాలలో వెలసిన పరమాత్మ ప్రతిమలు 'అర్చా'స్వరూపాలు.

ఈ ఐదు రూపాల్నీ కాంచీపూర్ణులు పై శ్లోకంలో ప్రస్తావించిన తీరు ఎంతో అపూర్వం, సహృదయానందకరం. ఇందులో గల అయిదు సంబోధనలు ఈ ఐదు రూపాలను ఉద్దేశించి ప్రయోగించినవే. "హస్తీశ"! అనే సంబోధన కంచిలో వేంచేసి ఉండే వరదరాజస్వామి అనే అర్చామూర్తిని గురించి చేసింది. కనుక ఇది అర్చామూర్తి సంబోధన. "శ్రీమన్" అనే

సంబోధన 'వైకుంఠే తు పరలోకే శ్రియా సార్థం జగత్పతిః, ఆస్తే' (శ్రీవైకుంఠం అనే గొప్ప లోకంలో అయితే జగత్పతి లక్ష్మీదేవితో పాటు వేంచేసి ఉంటాడు) అనే ప్రమాణానుసారం పరవాసు దేవుని దృష్టిలో పెట్టు కుని చేసింది. "అంబుజలోచన" అనే సంబోధన ఈ లోకంలో సుందరరూపాలతో అవతరించిన శ్రీరామకృష్ణావతారాలను తెలుపుతోంది. ఈ 'అంబుజలోచన'లో చెప్పుకున్న నేత్ర సౌందర్యం సర్వాంగసౌందర్యానికి ఉపలక్షణం. "ప్రణతార్తి హర!" అనే సంబోధన క్షీరాబ్ధిలో ఆదిశేషునిపై శయనించి ఉండే వ్యూహమూర్తిని దృష్టిలో పెట్టుకుని చేసింది. "పాఱ్కడలిల్ పామ్మణైమేల్ పళ్ళికొణ్డరుళుమ్ శీదనై" అని నమ్మాళ్వార్లు తిరువిరుత్త ప్రబంధంలో వ్యూహ మూర్తి ప్రణతార్తి హరత్వాన్ని కీర్తించారు కదా! ఆర్తులైన భక్తుల ప్రార్థనలను విని, వారి ఆర్తిని తీర్చడం కోసమే కదా పాలసముద్రంలో యోగ నిద్రలో స్వామి ఉంటాడు. "అచ్యుత" అనే సంబోధన అంతర్యామి స్వరూపాన్ని తెలుపుతోంది.

సమస్త ప్రాణి సంతాన ప్రవీణ! కరుణోల్బణ!
విలసంతు కటాక్షాస్తే మయ్యస్మిన్ జగతాం పతే॥

మొదటి శ్లోకంలో ఉన్న "శ్రీమన్! అంబుజలోచన" అనే రెండు సంబోధనలలోని అర్థాన్ని ఈ శ్లోకం వివరిస్తోంది. లక్ష్మీసహితుడు, కనుక సమస్తప్రాణులను రక్షించాల్సిన బాధ్యతను కలవాడు–అనే వివక్షతో శ్లోకంలోని పూర్వార్ధం అనుగ్రహించబడింది. "అంబుజలోచనుడు" కనుక, "తామరై ప్పూప్పోలే శజ్గణ్ శిఱుచ్చిఱిదేఎమ్మేల్ విళియావో" (తామరపూవు వలే ఉండే ఎఱ్ఱని నేత్రాలను నాపై కొంచెం కొంచెంగా ప్రసరింప జేయరాదా!) అని గోదాదేవి తిరుప్పావైలో ప్రార్థించినట్లుగా ఉత్తరార్ధం అనుగ్రహించబడింది. "ప్రవీణ" అన్నంతవరకూ వ్యస్త సంబోధనగా చేయకుండా, పూర్వార్ధాన్ని అంతటినీ ఒకే సంబోధనగా గ్రహించి, సకలప్రాణుల సమూహాన్ని రక్షించడంలో సమర్థమైన, అతిశయించిన కరుణను ఉద్వేగంగా కలవాడా!– అని కూడా అర్థాన్ని చెప్పవచ్చు.

నిందితాచారకరణం నివృత్తం కృత్యకర్మణః।
పాపీయాంస మమర్యాదం పాహిమాం వరద! ప్రభో॥

మొదటి శ్లోకంలోని "ప్రణతార్తిహర" అనే సంబోధనను ఈ శ్లోకం వివరిస్తోంది. "ఇదం కురు, ఇదం మా కార్షీః"– ఈ పనిని చేయి, దీనిని చేయకు. అని శాస్త్రాలు విధినిషేధాల రూపంలో మనకు కర్తవ్యాకర్తవ్యాలను బోధిస్తాయి. విహితాలను చేసి, నిషిద్ధాలను మాని వేయాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నడచుకొని, పాపాలను పూర్ణంగా చేసిన నన్ను రక్షించి, నీ ప్రణతార్తి హరత్వాన్ని కాపాడుకోవాలి అనే ప్రార్థన ఇందులో కన్పిస్తుంది. ఇది ప్రపత్తియోగం.

భగవంతుడొక్కడే నాకు రక్షకుడని ప్రగాఢ విశ్వాసాన్ని కలిగి ఉండడమే ప్రపత్తి.

సాధనం భగవత్ప్రాప్తౌ సేవేతి చ స్థిరామతిః।
సాధ్యభక్తిః స్మృతాసైవ ప్రపత్తిరితి గీయతే॥

అని భగవచ్ఛాస్త్రం. ఈ శరణాగతి శబ్దంలో ఉపాయమే ప్రధానంగా స్వీకరించడం కన్పిస్తుంది. అంటే పరమపదానికి భక్తుని తీసుకువెళ్లే సాధనం భగవంతుడొక్కడే. ఈ శరణాగతి ఆరు విధాలు.

'ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వ వరణం తథా
ఆత్మ నిక్షేప కార్పణ్యే షడ్విధా శరణాగతిః'

శ్రుతి, స్మృతులలో చెప్పినవిధంగా, నిత్యవైయక్తిక విధులలోనూ, భగవద్విషయంలోనూ అమిత శ్రద్ధనూ కలిగి ఉండడమే ఆనుకూల్య సంకల్పం. భగవంతునిపై మనసును లగ్నం చేయడానికి ప్రతిరోధకాలుగా నిలిచేవన్నీ ప్రాతికూల్య వర్జనమే. భగవంతుడు సర్వకాల సర్వావస్థలోనూ నన్ను తప్పక రక్షిస్తాడనే ప్రగాఢ విశ్వాసమే రక్షిష్యతీతి విశ్వాసం. ఈ విశ్వాసమే భగవంతుని అభయప్రదాతగానూ, ఆర్తావన ఘనునిగానూ భావించి, కీర్తించడా నికి హేతువు. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అని నిర్ణయించు కోవడం గోప్తృత్వ వరణం. తనకు సంబంధించిన సర్వ భారాన్నీ (పోషణ, రక్షణ, మోక్ష ప్రదానాది సర్వకార్యాలలోనూ) స్వామి అధీనమని సమర్పించడం. దీన్నే ప్రపత్తిగా వ్యవహరించడం వ్యవహారంలో ఉంది. అలాంటప్పుడు భక్తుని హృదయంలో భగవంతునిపై ధ్యాస తప్ప ఇతరాలోచనలేవీ ఉండవు. ఉండడానికి అవకాశమే లేదు. ఇదే ఆత్మ నిక్షేపం. నేను అకించనుడను అన్యథా గతి లేని వాడనని, నాకు నీవే దిక్కని తన దీనత్వాన్ని చాటుకోవడం కార్పణ్యం. ఈ ఆరింటిలోనూ ఆత్మ నిక్షేపాన్ని అంగిగానూ, మిగిలినవి అంగాలుగానూ సంప్రదాయంలో వ్యవహరిస్తారు.

(ఇంకా ఉంది)

04-10-2016
హంస వాహనం
(రాత్రి)




అలరిన నడపులె హంసవాహనములు



05-10-2016
సింహ వాహనం
(పగలు)

దిక్కు నీవే జీవులకు దేవసింహమా

05-10-2016
ముత్యపుపందిరివాహనం (రాత్రి)



మురిపాలమూడవనాడు ముత్యాల పందిరి క్రింద

ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనము లెక్క

06-10-2016 కల్పవృక్ష వాహనం (పగలు)



వరములిచ్చేయట్టి వరదహస్తము
కల్పతరుశాఖయని పోల్పదగునీకును

07-10-2016 మోహినీ అవతారోత్సవం (పగలు)



అదె చూడరే మోహన రూపం

06-10-2016 సర్వభూపాల వాహనం (రాత్రి)



సకలలోకేశ్వరులు సరుస చేసుకొనువాడు

08-10-2016 హనుమద్వాహనం (పగలు)



శ్రీవేంకటేశుని మన్నన బంటు
బెట్టిదపుమహిమల పెద్దహనుమంతుడు

గట్టిగా నిందుకే హరి కడు మెచ్చేమయ్యా



08-10-2016
గజవాహనం
(రాత్రి)

ఎక్కిన వానికి జూడ యేనుగ గజ్జెయుండు
వెక్కసమై వెలువ వేవేలు సేసునయ్య



07-10-2016
గరుడ వాహనం
(రాత్రి)

ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు భగ్గన పగిలె



08-10-2016
సువర్ణ రథం

బంగారు మెఱుగులవే కొండవంటి రథమదె


09-10-2016
సూర్యప్రభ వాహనం
(పగలు)



సురలెల్లా గొలువగ సూర్యచంద్రుల కన్నుల
తిరమైన మహిమల దేవసింహమా



09-10-2016
చంద్రప్రభ వాహనం
(రాత్రి)



ఆనందనిలయుని సేవలో...

అనంతాళ్వారు

-జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

వేంకటరమణస్వామికి ఎన్నోపేర్లు ఉన్నా, ఆ అన్నింటిలో సరిగ్గా సరిపోయే పేరు మాత్రం ఒకటి ఉంది. అదే 'సంకట హరణుడు' అని. అందుకనే భక్తులు వేంకట రమణా! సంకటహరణా!! అని గొంతెత్తి, ఏడుకొండలు మార్మోగేలా గట్టిగా పిలుస్తుం టారు. తమ సంకటాల్ని పోగొట్టుకుంటారు.

కొందరికి అనారోగ్యసంకటం. మరి కొందరికి దారిద్ర్య సంకటం, ఇంకొందరికి పెళ్లికాకపోవడం, పెళ్లి అయినా సంతానం కలగకపోవడం... ఇలా ఎన్ని సంకటాలో... ఎన్నెన్ని సంకటాలో!

ఇల్లాంటి ఎన్నో సంకటాల్ని పోగొట్టే స్వామికి ఒక పెద్ద సంకటం వచ్చి పడిం దంట! ఏడుకొండలవాడు తనకొచ్చిన సంకటాన్ని గూర్చి గొంతెత్తి రోజూ చెబుతూనే ఉన్నాడు.

సుమారు వెయ్యేండ్ల నుండి తన దగ్గరకు వచ్చిన ప్రతి భక్తునితో చెబుతునే ఉన్నాడు. తన వాకిట్లో అడుగు పెట్టిన ప్రతియాత్రికునితో తన సంకటాన్ని గూర్చి విన్పిస్తూనే ఉన్నాడు.

ఇంతకు ఏడుకొండలవాడికి కలిగిన సంకటం ఏమిటంటే, ఎవడో ఆయన్ను కొట్టాడంట? కొట్టడం అట్లా ఇట్లా కాదు. ఏకంగా మొహం వాచేట్లు కొట్టాడు. దేంతో కొట్టాడయ్యా అంటే, ఇదిగో! పొడవుగా ఉన్న ఈ గడ్డపారతోనే, ఇంతలావు పాటి గడ్డపారతోనే అంటూ ఆ గునపాన్ని తన మొదటి గడపలో, అందరికీ బాగా కనపడేట్లుగా చాల ఎత్తున వేలాడదీసి చూపిస్తున్నాడు.

అబ్బో! ఇంత పెద్దగడ్డపారతోనే! ఎలా కొట్టాడండీ! ఇంతకూ నిన్ను కొట్టిన ఆ పెద్దమనిషి ఎవరండీ!

అయినా ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దండి. నువ్వేం జెయ్యకపోతే మొహం వాచేట్లు అలా కొడతాడా? నిజం చెప్పు, నీ వేదో ఘనకార్యం చేసుంటావు. అందుకే ఇలా జేశాడు కదా! పైగా ఆ గడ్డపారను అంత ఎత్తున కట్టి అందరికీ చూపిస్తూ, పెద్దగా రాద్ధాంతం చేస్తున్నావు. బలేవాడివయ్యా వెంకయ్యస్వామీ!

ముందు నువేంజేశావో నిజం చెప్పు.

“వెయ్యేండ్లనాడు ఈ కొండమీద అనంతయ్య అనే భక్తుడు ఉండేవాడు. ఆయనకు దేవుడికంటె, అంటే నాకంటె కూడా గురువుమీదే భక్తి. గురి! గురువంటే ప్రాణం! ఆ గురువు చెప్పాడంట! శ్రీరంగక్షేత్రం నుంచి తిరుమలకు వెళ్లు. అక్కడ పూలతోటను పెంచు. దాని కోసం ఒక నీళ్లగుంటను తవ్వు. ఆ పువ్వులతో అనుదినం ఆనందనిలయుణ్ణి అలంకరించు అన్నాడంట!” గురువుమాట వేదం. ఆలస్యంలేకుండా వేంకటాచలం చేరుకున్నాడు. వెంటనే నీళ్లకోసం గుంటను తవ్వడం ప్రారంభించాడు. ఆయనకు తోడు ఆయన భార్య. ఆ తల్లి ఆయనకు సరిజోడు. 'గోవిందా! అంటూ ఆయన

ఈ అక్టోబరు 10వ తేదీన రథోత్సవం; 12న అనంతాళ్వారుతోట "బాగ్ సవారి" ఉత్సవం సందర్భంగా ఇది ప్రచురితం.

మట్టి తవ్వడం, వెంకటేశా! అంటూ దాన్ని ఆమె దూరంగా పోయడం. ఇదీ వాళ్లిద్దరి నిత్యకృత్యం రామనామం!

నాకోసమే దీక్షగా భక్తిగా పనిచేస్తున్న వీళ్లిద్దర్నీ చూశా! జాలివేసింది. వాళ్లు చేస్తున్న పనికి కొంచెం సాయం చేద్దామని పన్నెండేళ్ల కుర్రవాడి వేషంతో వెళ్లాను. "నేను సాయం చెయ్యనా" అని అడిగాను. అనంతయ్య కళ్లెర్రజేసి చురచుర చూశాడు. కొంచం భయపడుతూ "నాకు కూలి డబ్బులు వద్దులే. ఊరికే చేస్తాను" అన్నాను. అనంతయ్య అంతులేని కోపంతో తిట్టాడు. ఇంకా మీదపడి తంతాడేమో అని భయపడ్డాను. నేను వచ్చినవేళ మంచిది కాదేమో అని వెళ్లిపోయాను.


ఆ తర్వాత కొన్ని రోజులకు మళ్లీ వచ్చి చూశాను. గుంటను లోతుగానే తవ్వాడు. అనంతయ్య ఇంకా తవ్వుతూ మట్టిని అందిస్తూనే ఉన్నాడు. ఆయన భార్య మట్టిని దూరంగా పోస్తూనే ఉంది. కాని ఆమె బాగా ఆయాసపడు తోంది. దగ్గరికి వెళ్లి చూశా. ఆమె నిండుచూలాలు. అందుకే అలసిపోతోంది. పాపం! వెంటనే నేను "తల్లీ! ఆ మట్టి గంపను ఇటివ్వు. దూరంగానే పోసొస్తా" అని తీసుకున్నాను. ఆమె ఎంత బాధపడుతోందో? వెంటనే మట్టిగంపను ఇచ్చింది. దూరంగా మట్టిని పోసివస్తున్నా.

ఇంతలోనే అనంతయ్య చూడనే చూశాడు. అంతే! ఉగ్రుడయ్యాడు. గుంటపైకి వచ్చి 'ఎవడవురా నీవు? ఈ పని చెయ్యమని ఎవరైనా అడి గార్రా వెధవా?' అంటూ భరిం పరాని, వినరాని తిట్లపురాణం చదివాడు. బిత్తర పోయి వున్న భార్యను చూస్తూ "పనికి మాలినదానా! నీకైనా తెలివి లేదా! ఒకసారి వద్దన్నాం కదా. మళ్లీ వచ్చాడు. నీకు అంత చేతకాకపోతే, నేను చేసుకునేవాణ్ణి కదా." అంటూ ఆమెనూ, నన్నూ తిట్టినా ఆయన కోపం తగ్గలా. ఇంకా ఎక్కువైంది. చేతిలోని గునపంతో నా వెంట పడ్డాడు. తప్పించుకొని పరిగెత్తా. వెంటబడి ఆ గడ్డపారను నాపైకి విసరివేశాడు. అది నా గడ్డానికి తగిలి గాయమయ్యింది. ఇదిగో! ఇదే ఆ గాయం. బొట బొటా నెత్తురు కారుతోనే ఉంది. దానికి పచ్చకర్పూరం పొడిని ప్రతిరోజూ అద్దు కుంటూనే వున్నా! అనుకోండి.

ఇప్పుడు చెప్పండి. నేను జాలిపడి సాయం చెయ్యడం తప్పా? కూలికూడ వద్దన్నా కదా! అయినా మొహం వాచేట్లు కొట్టేంత తప్పు కాదే ఇది. కలియుగ ధర్మం కాబోలు.

ఇప్పుడు చెప్పండి. అనంతయ్యకు ఏం శిక్ష వెయ్యాలో?

ఇంతటితో ఆగాడా? ఇంకో తప్పు కూడా చేశాడు అత గాడు. దాన్నిగూడా మీకు చెప్తా. వినండి మరి!



'అనంతయ్య తోట చాల బాగుంది. అందంగా ఉంది. ఒక్కసారైనా ఆ తోట అందాల్ని చూచి తీరాల్సిందే!' అని అందరూ అనుకొంటుంటే, మెచ్చుకుంటుంటే విన్నాం. దాన్ని చూడాలని నేనూ, నా హృదయలక్ష్మి వ్యూహలక్ష్మి ఇద్దరం ఉబలాట పడ్డాం. ఆ తోట అందాల్ని ఆస్వాదించి ఆనందిద్దాం అని ఇద్దరం వెళ్లాం. అది కూడా తప్పేనా?

అనంతయ్య అభిరుచుల్ని మెచ్చుకోడానికే కదా వెళ్లాం. అబ్బ! నిజంగా ఆ తోట అంద చందాలు ఒకటా! రెండా! అబ్బో! ఎన్నెన్ని రంగుల పువ్వులు. ఎన్నెన్ని ఘుమఘుమలు,

దవనాలు, మరువాలు, తోటంతా కలియ దిరుగుతూ అందాల్ని చూశాం. ఆనందించాం. ఆ సమయంలో చాపల్యంకొద్దీ ఒకటి రెండు పూలను తుంచాం. వాసన చూశాం. మరి కొన్నింటిని సిగల్లో పెట్టుకొన్నాం.

అంత మాత్రానికే ఆ అనంతయ్య అంతులేని కోపం చూపిస్తాడా! భార్యాభర్తలు అనుకోకుండా, మాటువేసి మా ఇద్దర్నీ పట్టుకొని బంధిస్తాడా! నేను మగరాయుణ్ణి కనుక ఎట్లో తప్పించుకొని వచ్చాలే! పాపం నా పెండ్లాం. ఆడకూతురు కదా. సుకుమారి. తప్పించుకోడానికి గింజుకుంది. పిట్టపిల్లలాగా కీచు కీచుమని గీపెట్టింది.

కాని ఆ అనంతయ్య కొంచం కూడా కనికరం లేకుండా, అమెను సంపెంగమానుకు తీగలతో కట్టి వేస్తాడా! ఇదెంతటి ఘోర తప్పిదం?

ఇప్పుడు జెప్పండి. అతను చేసిన తప్పిదాలకు ఏ శిక్షలు వెయ్యాలో చెప్పండి. ఓ భక్తులారా మీరే తీర్పరులు...

భక్తులారా! వీటికి ఏ శిక్షలు వెయ్యాలో చెప్పండి. అలా నీళ్లు నములుతారేం! చెప్పండి మరి! ఉహూ... మీరేం జెబుతారు. చెప్పనే చెప్పరు. చెప్పలేరు కూడా. ఎందుకంటే మీరు అందరూ ఆయనకు తోటి భక్తులే కదా!

అందుకే, మీరు అందరూ మౌనం విడిచి పెట్టి, తీర్పు చెప్పేంతవరకు, నేనే ఒక పని చేస్తా!

"ఇదిగో! ఈ గునపం (గడ్డపార)తోనే నా గడ్డాన్ని పగలగొట్టాడు. అందరూ చూడండహో! అంటూ నా వాకిట్లో అందరికీ కనబడేట్లుగా చాలా ఎత్తున వేలాడదీస్తా. అనంతయ్య భక్తి బండారాన్ని బయటపెట్టా! ఇదేగాక, ఇంకా పచ్చకర్పూరాన్ని అద్దుకొని గడ్డం మీది గాయాన్ని కూడా నా దగ్గరికి వచ్చిన ప్రతి భక్తుడికీ చూపిస్తా"

అనంతాళ్వారు తోటకు ఆనందనిలయుడు

తిరుమలలో శ్రీవారి ఆలయానికి నైరుతి మూలలో 'అనంతాళ్వారుతోట' ఉంది. ఈ తోటకు శ్రీస్వామివారు రెండుమార్లు వెళ్తాడు.

మొదటిసారి, అనంతాళ్వారు పరమపదించిన ఆడి (కర్కాటక) మాసం పుబ్బనక్షత్రం రోజున ఆలయం నుండి ప్రదక్షిణంగా ఉత్సవంగా వెళ్తారు.

రెండవమారు తన పూలతోటను పాడు చేసిన సందర్భంలో అనందాళ్వారు, అలమేలు మంగను సంపెంగ చెట్టుకు కట్టవేసిన రోజున, అదే బ్రహ్మోత్సవం చివరిరోజున జరిగే "బాగ్ సవారి" ఉత్సవంలో అప్రదక్షిణంగా శ్రీస్వామి వారు వెళ్తారు.

ఇంక రెండో తప్పుకు, అంటారా? ఆ రోజే నేనే శిక్ష వేశాలే! వ్యూహలక్ష్మిని పూలగంపలో పెట్టుకొని భయభక్తులతో మోసుకొని రమ్మన్నా. వచ్చాడు. దానికి అనంతయ్యకు కన్యాదాన ఫలం సిద్ధించింది. నాకు 'మామ' అయ్యే ఫలం దక్కింది. అందుకే ప్రతి బ్రహ్మోత్సవంలో రథోత్సవం రోజున "అనంతయ్య"కు ఘనంగా కానుకలిస్తూ గౌరవిస్తూనే ఉన్నా.

అన్నట్లు మరిచిపోయా. ఈ సంఘటన తర్వాత అనంతయ్య 'అనంతాళ్వారు' అని గౌరవంగా పిలువబడుతున్నాడు. ఆయన తోటా, ఇల్లూ గుడికి నైరుతి మూలలో ఉన్నాయి.

భక్తులకు ఈ రెండు మధుర సన్నివేశాలు గుర్తుండటం కోసమే ప్రతిఏటా ఆడిమాసం (కర్కాటక)మాసం పుబ్బ నక్షత్రం రోజున, ఆలయ ప్రదక్షిణంగా ఒకసారీ, బ్రహ్మోత్సవంలో చివరి రోజున అప్రదక్షిణంగా రెండవసారీ, అనంతాళ్వార్ తోటకు ఊరేగింపుగా వెళ్లి అనంతయ్యను ఈనాటికీ సత్కరించి వస్తున్నాను తెలిసింది కదా! మీరూ అందరూ, అనంతయ్య తోటను, ఆయన సమాధిని దర్శించండి. తరించండి.



రాజేంద్రులు-ఖగేంద్రుడు వాహనమైనవేళ...

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

భూములేలే రాజులైనా
గగనానికి ఇలకు అనుసంధానం చేసే
గరుడుడైనా -
జగమేలే పరమాత్మ శ్రీవేంకటేశ్వరుడి
కనుసన్నల్లో....,
ఆయన చెప్పుచేతల్లో ఉండాల్సిందే!
సర్వభూపాలవాహనం,
గరుడవాహనాల మీద
ఈ ప్రత్యేకవ్యాసం చదవండి -



భూపాలురూ వాహనాలే

బ్రహ్మోత్సవాలలో 4వ రోజురాత్రి శ్రీమద్వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఉభయదేవేరులతో సర్వభూపాల వాహనంపై తిరుమాడవీథులలో ఊరేగుతారు. సమస్తరాజలాంఛ నాలతో ఈవాహనసేవ నిర్వహించబడుతుంది.

వజ్రవైఢూర్యాలు పొదిగిన కనకాభరణాలు, శోభాకర మైన గజమాలలు స్వామికి అలంకరింపబడి ఉంటాయి. స్వామి కృష్ణావతారంలో బకాసురుణ్ణి సంహరిస్తున్నరూపంలో దర్శనం ఇస్తాడు.

వాహనప్రాశస్త్యాదులు

భూమిని పాలించేవాడు భూపాలుడు. సమస్త విశ్వంలో లెక్కలేనన్ని సూర్యమండలాలున్నాయి. అన్ని సూర్యమండలా ల్లోనూ భూమి ఉన్నది. ఆ భూగ్రహాలనన్నింటినీ పాలించడం సర్వభూపాలత్వం. నైసర్గికసరిహద్దులు గల కొంతభూమిపై అజమాయిషీ కల్గిన వ్యక్తిని భూపాలుడనడం పరిపాటి. అటు వంటి భూపాలురందరూ బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. అందరూ కలిసి స్వామిని సేవించుకొంటారు. ఆ సేవకోసం తామే వాహనమైపోతారు. అలా వాహనీకృతభూపాలుర భుజ స్కంధాలపై మలయప్ప ఊరేగడమే సర్వభూపాలవాహనం.

శ్రీదేవి, భూదేవి స్వామివారిఉభయదేవేరులు, వారితో కలిసి అష్టైశ్వర్యాలతో కూడిన వాహనసేవను మలయప్పస్వామి పొందుతాడు. ఉభయదేవేరులలో శ్రీదేవి చంచలమైనది. ఆమె అనేకుల గృహాలు పర్య టిస్తూ ఉంటుంది. ఆమెకు స్థిరత్వం ఉండదు. భూదేవి అచల. స్థిరంగా ఉంటుంది. చంచలమైన మనసు గల్గినవారికంటే, నిశ్చలమైన మనస్సు గల్గినవారిని స్వామి బాగా ఇష్టపడతాడు. భూదేవి అంటే స్వామికి ప్రత్యేకమైన అభిమానం. దీనికి మరొక్క విశేషమైనకారణం భూమి స్వామివారి ధర్మసంస్థాపనకార్యక్షేత్రం కావడమే.

శ్రీమన్నారాయణుడు ధర్మస్వరూపుడు. ధర్మాన్ని కాపాడే విశిష్టదైవతం. అధర్మవర్తనులైన వారిని శిక్షించి ధర్మమార్గ ప్రవర్తకులైనవారిని రక్షించి, యుగధర్మాలను కాపాడడం స్వామి వారివ్రతం. ఆయనే స్వయంగా 'ధర్మసంస్థాపనార్థాయ సంభ వామి యుగేయుగే' అన్నారు కదా!

శ్రీమహావిష్ణువు అవతారాలన్నింటినీ పరిశీలించిన ప్పుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భూమితో సంబంధం ఉంటుంది. దానికి కారణం ఆయనకు భూమి మీద ఉన్న మక్కువే. మత్స్యావతారంలో సోమకుడు అనే రాక్షసుడు ధర్మ రూపాలూ, ధర్మప్రతిపాదకాలూ అయిన వేదాలను తస్కరించి నపుడు, సత్యవ్రతుడు అనే భూపాలునితో స్వామి కలిశాడు. భూమిపై గల సమస్తజీవరాసులు, ఓషధులు నీటిలో మునిగి, నశించకుండా సత్యవ్రతునిద్వారా సంరక్షించాడు.

కూర్మావతారం అమృతోత్పాదన లక్ష్యంగా జరిగింది. పాలకడలిని చిలికే కవ్వం మందరపర్వతం. అది సముద్రంలో మునిగిపోకుండా వీపున మోసినవాడు కూర్మరూపుడైన నారాయణమూర్తి. భూధరాన్ని మోసి, భూమిపై గల ప్రత్యేకప్రేమను చాటుకొన్నాడు.

హిరణ్యాక్షు డనే దనుజుడు భూమిని చుట్ట జుట్టి సముద్రంలో ముంచాడు. అప్పుడు హరి కిటిరూపాన్ని ధరించి, ఆ స్వర్ణనేత్రుణ్ణి సంహరించి, భూమిని ఉద్ధరించాడు. భూమితో ప్రణయాన్నికూడా నెరపాడు.

హిరణ్యాక్షుని సోదరుడు హిరణ్యకశిపుడు. తన సోదరుణ్ణి వధించినహరిని వధించి తీరుతానని ప్రతిన బూని, పదునాలుగులోకాల్లో హరికోసం వెదికాడు. హరి కనిపించలేదు. హిరణ్యకశిపునికుమారుడు ప్రహ్లాదుడు. పరమభాగవతోత్తముడు. నిరంతరం హరిని స్మరించేవాడు. ప్రహ్లాదుని హరినామసంకీర్తన హిరణ్యకశిపునికి కర్ణకఠోరంగా ఉండేది. హరిభక్తి మానమన్నాడు. హరిలేడన్నాడు. హరి మనకు శత్రువన్నాడు. హరిని చూపుమన్నాడు. సభాభవనంలోని స్తంభమందు చూపమన్నాడు. హరి నరసింహుడై అవతరించి, హిరణ్యకశిపుణ్ణి సంహరించాడు. ప్రహ్లాదుణ్ణి భూపాలునిజేశాడు.

ప్రహ్లాదునిమనుమడు బలిచక్రవర్తి. అతడు ముల్లోకాల నాక్రమించాడు. ఇంద్రుణ్ణి పదభ్రష్టుని జేశాడు. సురలు బ్రహ్మను ప్రార్థించారు. అందరూ విష్ణువును వేడుకొన్నారు. శ్రీహరి ఆదితేయుడుగా వామనుడై జన్మించాడు. బలిదగ్గరకు వెళ్ళాడు. వచ్చిన వటువును చూచి, బలి ముచ్చటపడ్డాడు. కోరినకోర్కెల తీర్చెదనన్నాడు. శుక్రాచార్యుడు వారించాడు. బలి వినలేదు. వామనుడు మూడడగుల నేలనుకోరుకొన్నాడు. బలి ధార వోశాడు. వామనుడు త్రివిక్రముడయ్యాడు. ఒక్కడుగుతో భూమిని కొలిచాడు. మరొక్కఅడుగుతో ఆకాశాన్ని ఆక్రమించాడు. మూడవ అడుగునకు బలి తన తలనే స్థానం చేశాడు. వామనా వతారం భూమితో అవినాభావసంబంధం కలిగింది. బలి పాతాళం చేరాడు.

శ్రీమహావిష్ణువు రేణుకా జమదగ్నులకు పరశురాముడై జన్మించాడు. భుజబలకండూతిగల కార్తవీర్యుణ్ణి వధించాడు. తపోభూమికి తరలిపోయాడు. కార్తవీర్యుని వారసులు జమదగ్నిని వధించారు. రేణుక సహగమనం చేసింది. ఈ వార్త పరశురామునికి తెలిసింది. ముయ్యేడు మార్లు క్షత్రియులపై దండెత్తాడు. రాజుల నందరిని చంపాడు. ఐదుమడుగుల రక్తంతో పితృతర్పణం చేశాడు. తాను జయించిన భూమిని కశ్యపునికి దానం చేశాడు. భూమి కాశ్యపి అయింది. ధర్మ సంస్థాపనం జరిగింది. భూమితో స్వామిసంబంధాన్ని చూచాము గదా! భూపాలురు స్వామిని మోయడం సహజమే కదా!

శ్రీమన్నారాయణుడు దాశరథి అయ్యాడు. రేపు పట్టాభిషేకం. కైకవరం, పితృవాక్యపాలన వెరసి రామునికి అరణ్యవాసం. భూపుత్రి సీతను ఈ అవతారంలోనే పెండ్లాడాడు. సాక్షాత్తు భూపాలకవంశంలో జన్మించాడు. ధర్మకంటకుల్ని వధించడానికి జనస్థానానికేగాడు. భూపుత్రిపై వలపుగొన్న రావణుని సంహరించాడు. విభీషణుణ్ణి రాజునుజేశాడు. వాలిని చంపి, సుగ్రీవుణ్ణి రాజుగా చేశాడు. భూమిపై ధర్మాన్ని రాజులెలా పాటించాలో చూపుటకై తానే స్వయంగా భూపాలుడై రామరాజ్యాన్ని నెలకొల్పాడు. స్వామికి భూమిమీద ఉన్న ప్రేమ అలాంటిది.

శ్రీమన్నారాయణుని అవతారాలలో పరిపూర్ణమైనది శ్రీకృష్ణావతారం. భూమికోసం తండ్రిని బంధించినవాడు కంసుడు. భూమికోసం ధర్మాన్ని కాలరాచి, ధర్మరాజాదులను అరణ్యమార్గం పట్టించినవాడు దుర్యోధనుడు. భూమిపుత్రుడై కూడా ధర్మదూరుడైనవాడు నరకాసురుడు. జరాసంధుడు, శిశుపాలుడు, దంతవక్త్రుడు, కాలయవనుడు మొదలగువారు – భూమికి భారమైనారు. భూభారాన్ని తగ్గించడం– ధర్మసంస్థాపన చేయడం లక్ష్యంగా, ధర్మప్రభువులచేతికి భూమిని బదలాయించడం వ్రతంగా సాగిన అవతారం శ్రీకృష్ణావతారం. భూమికి, స్వామికి ఉన్న సంబంధం అలాంటిది.

కృష్ణావతారం ప్రారంభంనుండి చివరివరకు వెన్నంటి ఉండే రేవతీరమణుడు బలరాముడు స్వామి రూపమే. ప్రలంబాసురుణ్ణీ, ధేనుకాసురుణ్ణీ వధించిందితడే. చాణూర, ముష్టికుల సంహారంలో కృష్ణునికి ఇతని తోడ్పాటు గొప్పది.

ఖడ్గహస్తుడై, అశ్వాన్ని అధిరోహించి, కలి మాయా విశేషపీడితుల ఉద్ధరణకై భూమిపై స్వామి కల్కిగా అవతరిస్తాడు. ధర్మస్థాపన జరుగుతుంది. స్వామివారి అవతారాలలో భూమికి

ఉన్న సంబంధం విడదీయరానిది. భూపాలురు ఆయనఆజ్ఞాను వర్తులు; దిక్పాలురు ఆయనకింకరులు. శ్రీమన్నారాయణుడు సర్వలోక చక్రవర్తి. ఇంద్ర, అగ్ని, యమ, నిరృతి, వరుణ, వాయు, కుబేర, ఈశానులు అయిన అష్టదిక్పాలకులూ, సగర, మాంధాత్రాదులైన షట్చక్రవర్తులూ. ప్రహ్లాద, గయ, అంబరీషాది భూపాలురు- అందరూ కలిసి చేసేసేవ సర్వభూపాల వాహన సేవ.

'నా విష్ణుఃపృథివీపతిః'

గరుడగమన రారా...!

భగవానుడు ఉత్సవసమయాల్లో అనేకవాహనాలపై తిరువీథులలో వేంచేయడంలో ప్రధానకారణం – చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ తనను చూచి, తరిస్తారనే లోకకల్యాణప్రదమైన సన్నివేశం అది. గరుడుణ్ణి భగవానుడు ఎందుకు అధిరోహిస్తాడు? అనే ప్రశ్నకు నమ్బిళ్లై అనే ఆచార్యులు–"విన్నై యుళ్లపోదన్ట్రో వాహనాపేక్షై యుళ్లదు?" అనే సూక్తంలో – "ఏదైనా పని ఉన్నప్పుడు కానీ, లేకపోతే గరుడుణ్ణి తృప్తిపరచడానికి గానీ, తనతృప్తి కోసం గానీ, నిత్యసూరుల్ని సంతోషపెట్టడానికి కానీ, భగవానుడు గరుడవాహనంపై వేంచేస్తాడని " అన్నారు.

గరుడుడు 'పెరియ తిరువడి' అని వైష్ణవ సంప్రదాయ పరిభాషలో వ్యవహరింపబడుతాడు. అంటే "గొప్పదాసు"డని అర్థం. యామునాచార్యులుకూడా గరుడునిభగవత్కైంకర్య పరత్వాన్ని 'దాస స్సఖా వాహన మాసనం ధ్వజో య స్తే వితానం వ్యజనం త్రయీమయః' అంటూ గరుడుడు స్వామివారికి 'దాసుడుగా, సఖుడుగా, వాహనంగా, ఆసనంగా, ధ్వజంగా, గొడుగుగా, విసనకర్రగా' ఉంటాడని పేర్కొన్నారు. ఇలా స్వామి వారిని సేవించేదాసుల్లో గరుడుడు అనేక కైంకర్యాలు నిర్వహిస్తు న్నందున 'పెరియ తిరువడి' అనే పేరు ఏర్పడిందన్నారు – పెద్దలు. పైగా సదా స్వామివారిపాదాలను మోసేభాగ్యం ఈ గరుత్మంతునికే దక్కింది గదా! అందువల్ల 'స్వామివారిని తానే మోయాలనే గరుడునిఆశనూ, ఆశయాన్నీ తీర్చడంకోసం భగ వానుడు అతణ్ణి అధిరోహిస్తాడని మరొకకారణం. "ప్రియో హి జ్ఞానినోஉత్యర్థం అహం, స చ మమప్రియః" అనీ, "మమ ప్రాణా హి పాండవాః" అనీ, "అతివార్ ఉయిరానాయ్" జ్ఞాను లకు ప్రాణసమానుడు అని చెప్పబడేవిధంగా భగవానుడు తన భక్తుల్ని ఎంతో ప్రేమిస్తాడు. అట్టిభక్తుల్లో గరుడుడు ప్రథమ గణ్యుడు కావడంవల్ల, అతణ్ణి అధిరోహించి, తృప్తి పొందుతాడ నేది మరో కారణం. గరుడునిపై భగవానుడు అధిరోహించి నప్పటి సన్నివేశాన్ని దర్శించి, సేవించాలనుకొనే నిత్యసూరుల్ని తృప్తిపరచడంకోసం గరుడారూఢుడవుతాడనేది ఇంకొక కారణం.

ఈ మూడే కాకుండా "పరిత్రాణాయ సాధూనాం వినా శాయ చ దుష్కృతామ్।" అని భగవానుడు స్వయంగా తానే పేర్కొన్న అవతారప్రయోజనాలు సిద్ధించడంకోసంకూడా గరు డుణ్ణి అధిరోహిస్తాడు. భట్టనాథసూరి, శఠకోపయోగి, పరకాల యోగి వంటి మహనీయుల్ని అనుగ్రహించడంకోసం స్వామి గరుడవాహనంపై వేంచేశాడని ఆయా వృత్తాంతాలవల్ల తెలు స్తూంది. కనుక సాధురక్షణకోసం కూడా శ్రీవారు గరుడవాహనా రూఢుడవుతారు. ఇక దుష్టశిక్షణ కోసం గరుడుణ్ణి అధిరోహించిన సందర్భాలు ఎన్నో! నరకాసురవధ, బాణాసురవధవంటి ఉదం తాలు ఇక్కడ జ్ఞప్తి చేసుకోవచ్చు. ఇలా భగవానుడు గరుడ వాహనంపై వేంచేయడంలోని కారణాలన్నీ– అర్చామూర్తి శ్రీవేంక టేశ్వరుని విషయంలో కూడా అనుసంధానించుకోవాలి. అప్పుడే ఈ గరుడవాహనోత్సవం అన్వర్థం అవుతుంది.

గరుడునిరెక్కలు జ్ఞానవైరాగ్యాలు. శ్రీవారిపాదాలు సకలాభీష్టప్రదాలు. గరుడవాహనవిశేషాలు ఆళ్వార్లు సాయించిన రీతినీ గమనిద్దాం!

తిరుమంగై యాళ్వార్లు పెరియ తిరుమొళిలో 'గరుడుణ్ణి ఎక్కి మేఘాలమధ్య స్వామి సాక్షాత్కరించినట్లు' వర్ణించారు.

తిరుమంగైయాళ్వారు 'నాయికకు స్వామి దర్శనమి చ్చాడు. మబ్బుల వెనుకనున్న చంద్రునిలా ఎత్తుగా తిరుమాలి రుంజోలై వల్లభుడు వచ్చాడు. నా కన్నులనుండి వీడడు. మరొ కరు తీరునీర్మలై స్వామి. మబ్బుల ఎత్తుకు బంగరుకొండపై లేచిన మేఘంవలె వచ్చారు. అందమైన రెక్కలు గల గరుడుణ్ణి ఎక్కి వచ్చారు. ఆశ్చర్యం. ఒకరికంటే ఒకరు అందంగా ఉన్నారు' అని ఆళ్వారునాయిక గరుడునిపైనున్న స్వామిని దర్శించింది.

అథర్వసంహిత – గరుత్మంతుణ్ణి (సుపర్ణుణ్ణి) "సమస్త విషాలనూ హరించడానికి గరుత్మంతుడు సమర్థుడు" (4–2–1) అనీ, "సభావివాదంలో జయాన్ని ఇచ్చేఓషధిని తిన్నవాళ్లల్లో ఈయనకూడా ఒకడు" – అనీ పేర్కొనింది. కనుక గరుడ

వాహనం, శ్రీవారిని భక్తితో దర్శించి, సేవించేవాళ్లకు సమస్త విషభయాలూ నశిస్తాయి. విషభావాలు దూరమై, సద్భావాలు సిద్ధిస్తాయి. సభావివాదాల్లో విజయం లభిస్తుంది.

సంస్కృతంలో గరుడపంచాశత్, గరుడగద్యం మొదలగునవి ప్రసిద్ధాలు. శ్రీ వేదాంతాదేశికులు గరుడదండకం వ్రాశారు.

ఆగమాలలో ధ్వజారోహణసమయంలో పఠించే గరుడలగ్నాష్టకాలూ, గరుడచూర్ణిక, గరుడగద్యాలు ఉన్నాయి.

గరుడలగ్నాష్టకాలలో

సువర్ణవర్ణో భుజగోపవీతీ నాగాంతకో విష్ణురథ స్సుపర్ణః।
ప్రహ్లాదవద్భాగవతాగ్రగణ్యః ఖగేశ్వరో న శ్శుభ మాతనోతు॥

ఇలా ఉండే శ్లోకాలద్వారా గరుడుడు సర్పయజ్ఞోపవీతం కలవాడనీ, విష్ణురథమైనవాడనీ, ప్రహ్లాదునివలె భాగవతాగ్రగణ్యుడనీ, అనన్యసాధారణవిక్రమాఢ్యుడనీ, లక్ష్మీకటాక్షాంచిత పుణ్యమూర్తి అనీ, హరిప్రియుడనీ, వైష్ణవధర్మవేది అనీ, ధర్మప్రసంగప్రథితాత్మశౌర్యుడనీ, జగద్ధితానంతగుణాంబురాశి అనీ, కృపాళుడనీ, సత్యవ్రతుడనీ, స్వేచ్ఛారూపుడనీ, శ్రుతిస్మృతిజ్ఞానగురువనీ - పేర్కొనడం జరిగింది.

తత్పురుషాయ విద్మహే । సువర్ణపక్షాయ ధీమహి
తన్నో గరుడః ప్రచోదయాత్ - అని గరుడగాయత్రి.

గరుడుడు మహావేగుడు. మహాబలుడు. సూర్యమండలం దాకా ఎగిరిన బలశాలి. ఇంద్రాదుల్ని సరకుగొనక-అందర్నీ జయించి, అమృతభాండం తెచ్చి, తల్లి దాస్యాన్ని పోగొట్టిన మాతృభక్తిపరాయణుడు. చేజిక్కిన అమృతాన్ని తిరస్కరించి, జాత్యుచితమైన సర్పాలనే ఆహారంగా వరంపొందిన నిస్స్వార్థవ్యక్తి. ఈ నిస్స్వార్థత, మహాబలం, మహావేగం, ధైర్యస్థైర్యాలూ, జ్ఞానవిజ్ఞానాలూ గమనించినమహావిష్ణువు గరుడుణ్ణి తనకు వాహనంగా స్వీకరించాడు.

ఇంతటి మహాత్ముడు-జగన్నాయకుడైన శ్రీవేంకటేశ్వరునిపాదపద్మాలను- తనహస్తపద్మాలపై ఉంచుకొని, శ్రీవారి వాహనమై ఊరేగే దివ్యదృశ్యాన్ని భక్తిప్రపత్తుల్తో దర్శించేవాళ్లు నిజంగా ధన్యులు. కాలసర్పయోగంవల్ల కల్గేవంధ్యాదోషం, ఆలస్యవివాహం, సంతాననష్టం మొదలైనకష్టాలన్నీ తొలగి, సుఖశాంతులతో వర్ధిల్లుతారు.




పాఠకులకు, ఏజెంట్లకు,
చందాదారులకు
దీపావళి (30.10.2016)
పర్వదిన శుభాకాంక్షలు

తిరుమల ఆలయంలో గరుత్మంతుడు నమస్కారముద్రతో శ్రీవారికి ఎదురుగా నిల్చుండి, శ్రీవారిని దర్శిస్తూ, నమస్కరిస్తూ, భక్తుల్నీ గమనిస్తూ, భగవద్భాగవతదాస్యభక్తిని నిరూపించుకొంటున్నాడు.

గరుడనిసేవాదృక్పథం, మాతృభక్తి, ప్రభుభక్తిపరాయణత, సత్యవాక్పియతి, నిస్స్వార్థత, నిష్కళంకత, ఉపకారగుణం, మొదలగు ఉత్తమగుణాలు సమాజానికి స్ఫూర్తిదాయకాలు. ఇందుకే గరుడసేవకు ఎనలేనిప్రచారం, ప్రభావం, విశిష్టత ఏర్పడ్డాయి. రెక్కలున్న వన్నీ చుక్కలలోకాలకు ఎగురుతాయి. హృదయానికి భక్తి అనే రెక్కలు మొలిస్తే మానవుడు మాధవసన్నిధిని చేరుకుంటాడు. గరుత్మంతుడు - భగవంతుణ్ణి భక్తుల దరికి చేర్చే పుణ్యకార్యకర్త. ఈ అభ్రగపతికి జగత్పతితో విడదీయరాని సంబంధంఉంది.

పశుపక్ష్యాదులమీద, జంతుజాలం మీద మానవులకు జీవకారుణ్య భావాన్ని పెంపొందించడంకోసమే మన ఋషులు ఆయాదేవతలకు ఆయావాహనాలను జతపరచారు - లేకుంటే సర్వవ్యాపకుడికి ఈ వాహనాలెందుకు? లోకసంచారాలెందుకు?

వైకుంఠపాళి 09



నిలువు

- **2)** విష్ణుసతి (2)
- **3)** గరుడుడు (4)
- **4)** ప్రాచీనకాలంనాటి ఓ రాజ్యానికి మరోపేరిది (క్రింది నుంచి పైకి) (2)
- **5)** భౌద్ధచైత్యం (3)
- **6)** వేదమాత (3)
- **10)** వీరభద్రుని ఆయుధం (3)
- **11)** శివుడు (3)
- **14)** 'నృత్తరత్నాకరం' కృతికర్త (3)
- **15)** బలభద్రుని రథనామం (4)
- **16)** 'మువ్వగోపాల' పదాల కవి (3)
- **20)** బలం (2)
- **21)** పాండురాజపత్ని (క్రింది నుంచి పైకి) (2)

అడ్డం

- **1)** 'ముకుందమాల' కృతికర్త (7)
- **7)** శ్రీకృష్ణుని మేనత్త (2)
- **8)** విష్ణుమూర్తి (3)
- **9)** సూర్యపత్ని (2)
- **12)** తీతువు (3)
- **13)** మయూరం (3)
- **17)** యయాతిసుతుడు (2)
- **18)** తామరతూడు (3)
- **19)** ప్రయాణం (లేదా) దారి (2)
- **22)** దేవుని ద్వివిధ రూపాలు (7)

నిర్వహణ
బి.వి.ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యం

జవాబులు
ఈ సంచికలోనే ఉన్నాయి.
అన్వేషించి....
సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

ధారావాహిక 07

పరమయోగివిలాసం

– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

కాంచీపురరాజు పల్లవరాయడు నిత్యయౌవనాన్ని పొందుటకు భక్తిసార శిష్యులైన కణికృష్ణుణ్ణి ఆహ్వానించి, తొలుత తనపై కవిత్వం చెప్పమని, ఆపై అతనిని అమానించి, వారి శాపానికి గురికాకుండ, శరణాగతి పొందాడు. ఆటుపై ఏమి జరిగిందో చదవండి...

భక్తిసారులవారు సంతసించారు. తానూ కదిలారు. గోవు వెంబడి దూడ కదలినట్లుగా శేషశాయి, లక్ష్మి, సకలదేవతలు నిజవాసం చేరుకొన్నారు. భక్తిసారుల వారు నాగేంద్రశాయి ఆల యానికి వచ్చి స్తోత్రాలు చేశారు. “ఫణిశాయి! కాంచికా పట్టణా ధీశ! కణికృష్ణుడు మరల వచ్చాడు. నీవు మునుపటిలాగా శేష తల్పంపై పడుకోవయ్యా!” అనే అర్థం వచ్చేలా పద్యం చెప్పాడు. స్వామి యథారీతి కనిపించాడు. ఈ కారణంవల్లనే ఆ స్వామికి ‘యథోక్తకారీశుడని’ పేరు వ్యాప్తమయింది.

భక్తిసారులవారు తాను చెప్పినట్లు ఊకొట్టినస్వామిని చూచి– ‘గోవింద! నను గన్న తండ్రి!బ్రహ్మాండపటలాన్ని ఆడించే నీవు నేను ఆడినట్టు ఆడినావా? నీ భక్తవాక్య పాలనాసౌలభ్యాన్ని ఏమనవలె?’

అంటూ తమిళభాషలో ఒక రచన చేశాడు. తదనంతరం శిష్యులతో అర్చామూర్తుల్ని సేవించడానికి చోళమండలానికి పయనమయ్యారు. కుంభకోణంలోని శార్ఙ్గపాణిని దర్శించు కొన్నారు. భక్తిసారులు చిరకాలం కాంచీపురంలో పన్నగశయన మూర్తినే సేవించినవారు. ఆ మహానుభావుల మదిలో ‘తల్పశాయి భంగిమ’ ముద్రితం. అంచేత కుంభకోణంలో స్వామి భక్తిసారులకు మానసికచిత్రరూపంతోనే దర్శనమిచ్చారు.

భక్తిసారులు పరవశించారు. స్వామి శయనభంగిమను ఆలంకారికంగా వర్ణించారు. ఆ సందర్భంలో వారు గానం చేసిన పాశురాలు అద్వితీయం. అనుపమానం.

‘స్వామీ! ఏ కారణంతో నీవు పడుకొన్నావు. అలసట వల్లనా? బడలికచేతనా?

చక్రం చేతబట్టి రాక్షసులను చంపిన నీకు బడలికా?

సముద్రంలో జొరబడి దనుజుని అణచి వేదాలు తెచ్చిననాటి బడలికా! సముద్రమథనంలో మంథర పర్వతభారం మోయలేక బడలికా!’ అంటూ అవతారాలను వినుతించారు.

శార్ఙ్గపాణి సంతోషించాడు. యోగివరులతో పలుమారు మాటలాడినాడు. అసలు స్వరూపంతో దర్శనమిచ్చాడు.

తదనంతరం ‘శార్దూలపురికి’ పయనమయ్యారు. ఆ ఊరిలో చేటలు అమ్మేవానిలా వీధుల్లో నడక సాగించారు.

ఆ వీధుల్లో ఒక వీధి. ఆ వీధిలో ఒక ఇంటి అరుగు. అరుగుమీద వేదాధ్యయనం సాగుతున్నది. వేదపండితులు స్వర యుక్తంగా విద్యార్థులచేత అధ్యయనం చేయిస్తున్నారు.

శిష్యులు ‘పనసలు’ వల్లిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో యోగివల్లభులు ఆ వీధిలో నడక కొనసాగించారు. వేదాధ్యయనం చేయించే గురువు అధ్యయనం ఆపాడు. బుక్కులు పఠించే శిష్యుల్ని ఆపండని అదలించాడు. భక్తిసారులు ఆ దృశ్యం చూసి నవ్వుతూ మరో వీధివైపు నడిచారు. ఆపై వేదపండితుడు పాఠప్రవచనం మొదలెట్టాలని భావించాడు. కాని పాఠం ఎక్కడాగిందో గుర్తుకు రాలేదు. దారిలో తచ్చాడే ఒక బ్రాహ్మణుని పిలిచి– “విప్రోత్తమా! నీవిక్కడే ఉన్నావు కదా! పాఠం వింటున్నావు కదా! పాఠం ఎక్కడాగిందో చెబుతావా?” అని ప్రశ్నించాడు. ఆ విప్రుడు దిక్కులు చూడసాగాడు. వేదపండితుడు నివ్వెర పోయాడు. వేదమంత్రాలు గుర్తుకు రాకపోవడమేమిటి?

‘ఔను. పాఠప్రవచనం చేసేవేళ ఒకడు ఈ దారినే వెళ్ళాడు. అపుడు పాఠం ఆపడం వాస్తవం. బహుశః అతడు ‘వాకట్టు’ చేశాడేమో?’ అంటూ వీధుల తిరిగి యోగీంద్రుల పాదాలపడ్డాడు.

‘బ్రహ్మణ్యమునివేద్య! భవరోగవైద్య! కృపానిధీ! మా నేరాలు మన్నించు. పాఠప్రవచనాలతో బతికేవాళ్ళం’ అని కాళ్ళావేళ్ళా పడగా భక్తిసారులు కరుణించారు. అయినా ఏమీ మాటాడలేదు. కిందికి వంగి ‘నల్ల వరిగింజను’ వారికి చూపారు.

అంతే ‘వ్రీహి’ దగ్గర ఆగామని గుర్తుకువచ్చింది.

గురుతుల్యులకు నమస్కరించి స్వగృహం చేరుకొన్నారు.

‘హరిభక్తి కలవారే ముల్లోకాల్లోనూ అధికులు’ అనడం వాస్తవ మయింది.

యోగీంద్రులు ఆ నగరందాటి మరో నగరం చేరుకొన్నారు. ఆ నగరంలోని విష్ణ్వాలయాన్ని దర్శించుకొని ప్రదక్షిణం చేస్తూం డగా ‘హరిపాదు’డనే విప్రుడు ఎదురుపడ్డాడు.

ఆ విప్రుడు భక్తిసారుల పాదాలపడి నమస్కరించాడు.

‘అయ్యా! నేనొక యాగం చేస్తున్నాను. మీ దర్శనంతో పావన మయింది. మీరు దయతో మా యాగశాలకు వేంచేయవలె. కృతార్థుని చేయవలె. ఈ దాసుడు సమర్పించే ‘అగ్రపూజ’ అందుకో వలె. అపుడు నా యజ్ఞం యజ్ఞమవుతుంది. అపుడే యోగేశ్వరుడు కృష్ణుడు సంతృప్తిపడతాడు. దేవర దయచేయ వలె’ అని బతిమా లాడు.

యోగీంద్రులు సరేనన్నాడు. హరిపాదులతో కదలివెళ్ళారు. యాగశాల చేరుకొన్నారు.

ధర్మరాజు శిశుపాలాదులు చూస్తుండగా శ్రీకృష్ణుని అర్చించి నట్టుగా హరిపాదుడు ‘యోగిని’ ఉన్నతాసనంపై కూర్చోబెట్టి అర్చించసాగాడు.

ఈ దృశ్యాన్నంతా చూస్తున్నారు అక్కడి ఋత్విజులు, ద్విజులు. వారికి 'ఒళ్ళు' మండింది.

హరిపాదుల్ని ఇష్టంవచ్చినట్టు ఆడిపోసుకొన్నారు.

"ఏ శాస్త్రచర్చనయినా చేయగలిగిన పండితులకు కొదవా? వేదపర్వతాల్లాంటి బ్రాహ్మణులు లేరా? వాదానికి బృహస్పతి వచ్చినా సై అనే ఘనపాఠులు లేరా? అశ్వమేధాదియాగాలు చేయ గలిగిన సమర్థులయిన శ్రౌతులు లేరా? ఇంతమంది ఉండగా ఏమాత్రం భయం లేకుండా ఇక్కడున్న వారినందరిని కట్టకడపార వేయడమా? అనామకుడైనవానిని అందలమెక్కించడం న్యాయమా? ఇతరులు నవ్వరని కాసంత ఇంగిత జ్ఞానమయినా లేదు. అగ్రజన్ము లతో సమానులని ఎవరినయినా పూజించడం సమర్థనీయమా?" అంటూ వెటకారంగా 'ఓజమాలిన వాజ! ఆహా! నీ జన్మ సఫల మయింది. ఈ భూప్రపంచంలో నీకు సాటి ఎవరూ లేదు. అన్ని టికీ నీవే తగినవాడివి. ఆహా! ఎంత అదృష్టమో? బంధుజనుల మధ్య పెద్దవాడనిపించుకొన్నావు. నీవే వైదికుడివి. నీ బ్రాహ్మణ్యమే సర్వశ్రేష్ఠం. యాగం సాంగోపాంగంగా పూర్తి అయిందికదా! నీ ప్రవర్తనకు మేము ఏమని చెప్పాలి' అంటూ రుసరుసలాడారు.

ఆ కోపానికి వారి 'గడ్డాలు' అదిరాయి. చంకపెట్టినపుస్తకాలు కిందపడ్డాయి. కట్టిన పంచెలు ఊడాయి. ఒళ్ళంతా చెమట పట్టింది. నొసటపెట్టిన ఊర్ధ్వపుండ్రాలు కరిగిపోయాయి. అంతే వెంటనే వారంతా ఒకచోట సమావేశమయ్యారు.

"ఇదే మా తీర్మానం. ఈ హరిపాదుని ఇంట్లో ఎవరూ భోంచేయరాదు. ఒకవేళ ఎవరైనా ఆతిథ్యం అంగీకరించి వెళ్లితే ఆ బాపని జంధ్యాలు తెంపేయాలి. అనామకునిగా గుర్తించాలి" అన్నారు. ఈ హడావిడి అంతా చూశారు భక్తిసారులు.

'హరిపాద! భయపడకు. దిగాలు పడవద్దు' అంటూ మనసులో స్వామిని ప్రార్థించారు. 'స్వామీ! ఈ అవమానం హరి పాదునకు కాదు. నాకు కాదు. యాగఫలమిచ్చే నీది. యాగం సమకట్టిన ఈ హరిపాదుని సమర్థించడం సబబు. నీ దివ్యవిస్ఫూర్తి మూర్తిని ప్రదర్శించు'మని వేడుకొన్నారు.

అంతే! ఎదురుగా స్వామి సాక్షాత్కరించాడు.

శ్రీ రమానీళలతో, పంచాయుధాలతో, సర్వాలంకారాలతో, నిత్యులతో, భాగవతులతో, దేవనికాయంతో యాగశాలలో ప్రత్యక్ష మయ్యాడు. ఈ దృశ్యం చూడగానే అందాకా ఆడిపోసుకొన్నవారు గుభేలుమన్నారు. భయభ్రాంతులై ఆ మౌని అడుగుల వాలారు.

'స్వామీ! అపరాధం క్షమించండి. మేము దురహంకారులం. అజ్ఞానమనే సముద్రంలో పడి కొట్టుమిట్టాడేవారలం. ఇకపైన అయినా మీ పాదమనే ఓడ బట్టుకొని దాటాలి. మేము రెండు పాదాల పశువులం. మేము ఏనుగుల్ని చూచి కుక్కలు మొరిగినట్లు కారుకూతలు కూశాము.' అని ప్రాధేయపడగా ఆ యోగి కరుణిం చాడు.

తదనంతరం బ్రాహ్మణులందరు ప్రత్యక్షమయిన స్వామికి నమస్కరించి 'హరిపాదుని' వేనోళ్ళ పొగడి తాను తలపెట్టిన యాగాన్ని పూర్తిచేశాడు. బ్రహ్మాదిదేవతలు యోగివరుని అనుజ్ఞతో తమ తమ లోకాలకు తరలి వెళ్ళారు.

హరిపాదుడు అవభృథస్నానంచేసి అక్షపాదులవారికి నమస్క రించి తన చుట్టూవున్న బ్రాహ్మణులను చూచి – 'సహచరులార! అక్షపాదులు మహిమాన్వితులు. బాల్యావస్థలోనే సామాన్య బాల కునిలా ప్రవర్తించలేదు. భక్తితో వృద్ధదంపతులు సమర్పించిన 'పాలు' ఆరగించారు. ఆ వృద్ధుల్ని యువకులు కందని ఆశీర్వదిం చారు. వారికి సంతానం ప్రసాదించారు. పరమశివునికే పాఠం నేర్పారు. కొంకణుడనే సిద్ధునికి 'పాదరాజఘుటికను' ఇచ్చి లౌకిక వాంఛ తగదని అనుభవపూర్వకంగా తెలిసేటట్లు చేశారు. కణి కృష్ణుని శిష్యునిగా స్వీకరించారు. తన్ను సేవించిన ముసలిదానిని యువతిగా మార్చారు. భక్తుల మాటల్ని భగవంతుడు వింటాడని పాలకులకు తెలిసేలా చేశారు. శార్ఙ్గపాణిలో శేషశయనుని దర్శిం చారు. నా పూజ అందుకొన్నారు. స్వామి సాక్షాత్కారదర్శనభాగ్యం మీకందరికి కలిగించారు. ఈ యోగివరులను వర్ణించడం సాధ్యం కాదు. దేవరమహిమ శ్రీ దేవునికే తెలుసు' అనగానే యోగీంద్రులు హరిపాదులను కావలించుకొని వరాలిచ్చి శిష్యునితో అర్చావతార మూర్తుల దర్శనార్థం కదలివెళ్ళారు.

ఈ సన్నివేశ రచనతో తిరువెంగళనాథులు ద్వితీయాశ్వాసం ముగించారు.

ఫలశ్రుతిగా....

"ఇరవొందు భక్తియై నీ భక్తిసారు
చరితల నీ ధరాస్థలి నెవ్వడేని
గృతి యొనర్చిన యట్టి కృతకృత్యమతికి
హతబుద్ధిఁ బ్రతిదినం బెన్నువారలకు
వినిన వ్రాసినఁ జదివిన వారి కెపుడు
అనుపమదీర్ఘాయు రైశ్వర్యతతులు
అకలంక శుభములు అభిమతార్థములు
సకలసిద్ధులు కరస్థలినుండు" అని ముగించారు.

తిరుమళిశై ఆళ్వారులకే చతుర్థయోగి, మహీసారయోగి, అక్షపాదయోగి, భార్గవముని, దీర్ఘతపోముని, చక్రాంశయోగి, హరి పాదముని, ఊర్ధ్వపుండ్రముని, శబరయోగి, యాగముని, మంత్ర ముని, సిద్ధిముని, శాక్యజిద్యోగి, పన్నగయోగి, తేజోయోగి, జ్వాలా ముని, గుహయోగి, తీర్థయోగి, శుభాయోగి, నేత్రకుంజరయోగి, కణికృష్ణగురుముని అనే అనేక నామాంతరాలున్నాయి.

మఖాయాం మకరేమాసే చక్రాంశం భార్గవోద్భవమ్
మహీసారపురాధీశం భక్తిసారమహం భజే

(ఇంకా ఉంది)

పరమశాంతునకు బాపము రాదు

వేదపురాణాల్లో వేంకటేశుని బ్రహ్మోత్సవాలు

– డా॥ ముదివేడు ప్రభాకరరావు, 94418 72536

కల్పాంతకాలంలో జలప్రళయం సంభవించగా, ఏడు సముద్రాలు ఏకమయ్యాయి. మఱ్ఱిఆకుపై పసికందుగా పవ్వళించిన బాలముకుందుడు తన ఒంటరితనాన్ని పోగొట్టుకోవడానికి సృష్టి చేయాలని సంకల్పించాడు. వెంటనే, విష్ణు నాభికమలం నుండి బ్రహ్మ ఆవిర్భవించగా, సృష్టి చేయమని ఆజ్ఞాపించాడు తండ్రి. తండ్రి ఆదేశానుసారం బ్రహ్మ మూడు విడతల్లో సృష్టి చేశాడు.

వేదకథ

ఋగ్వేదానికి చెందిన తైత్తిరీయ సంహిత (3-1.1.1)లోని సృష్టి కథకే 'దీక్షితవాద'మని పేరు. "బ్రహ్మసృష్టిలో మొట్టమొదట సర్పములు పుట్టాయి. రెండవ సారి సృష్టిలో పక్షులు పుట్టాయి. మూడవసారి సృష్టిలో ప్రజలు (స్త్రీ, పురుషుడు) పుట్టారు."

సృష్టిలో తొలిసారిగా పుట్టిన పాముకే అనంతుడు, ఆదిశేషుడు అని పేర్లు. సృష్టి ఉండేంతవరకు ఉండేవాడు అనంతుడు. ఈయనకే ఆదిశేషుడని పేరు. సృష్టి యొక్క 'ఆది'లో పుట్టి, సృష్టి చివర వరకు 'శేషించి' ఉండేవాడు ఆది-శేషుడు. ఇతడే వైకుంఠంలో విష్ణువుకు పాన్పు. మూడు విధాలైన జీవులలో తొలివర్గంలోని నిత్యులలో మొట్ట మొదటివాడు. లక్ష్మీదేవిలాగా స్వామిని విడిచి క్షణకాలమైనా ఉండని అనపాయనుడైన తొలి భక్తుడు, ఆదిశేషుడు.

కృతయుగంలో ఆదిశేషుడుగా, త్రేతాయుగంలో లక్ష్మణుడుగా, ద్వాపరయుగంలో బలరాముడుగా, కలి యుగాంతంలో వటపత్రంగా స్వామిని సేవిస్తూ ఉన్న నిత్య నిరంతర భక్తుడు. ఈయనే పాంచరాత్ర ఆగమశాస్త్రంలో 'సంకర్షణుడ'ని ప్రసిద్ధి. (చూ॥ భాగవత మహాపురాణం) తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో తొలిరోజు రాత్రి పెద్దశేష వాహనం. రెండవరోజు ఉదయం- చిన్నశేషవాహనం. సృష్టిలో తొట్టతొలి జీవునిసేవను 'ఆదిశేషవాహనం'గా ఆగమశాస్త్రాలు పేర్కొన్నాయి.

బ్రహ్మరెండవ సృష్టిలో పుట్టిన ప్రాణి-ఆకాశంలో ఎగిరే పక్షి. ఇతడే గరుడుడు లేదా గరుత్మంతుడు. మాతృదాస్యవిముక్తి కోసం, ఇంద్రుని ఓడించి అమృత కలశాన్ని భూమికి తెచ్చినప్పటికీ, దాన్ని దుర్వినియోగం, కానివ్వకుండా తిరిగి ఇంద్రునికే సమర్పించిన త్యాగధనుడు. ఇటువంటి కర్తవ్యనిష్ఠాగరిష్ఠునే విష్ణువు ఏరికోరి తన వాహనంగా స్వీకరించాడు. నిత్యజీవుల్లో రెండవవాడు. తల్లి కన్నీళ్లను తుడిచి లోకానికి ఆదర్శపుత్రుడుగా నిలిచినవాడు. కంచిలో గరుడసేవ ఎంత విశేషమో తిరుమల శ్రీవారి గరుడ సేవ అంత వైశిష్ట్యం గలది. ఈతని పవిత్ర చరిత్ర సంస్కృ తాంధ్ర భారతాలలో విపులంగా వర్ణితం. స్వామివారి కొలువులో పనిచేస్తున్న ప్రతిఒక్కరు గరుడుని వలె నిస్వార్థ సేవాపరాయణులు కావాలన్నదే గరుడసేవకు గల పర మార్థం.

బ్రహ్మమూడవసారి చేసిన సృష్టిలో స్త్రీని, పురుషుని సృష్టించాడు. వీరి సంతానమే ప్రజలు. సనకాదులు, ఆళ్వారులు, ఆచార్యులు ముక్త జీవులైతే, సంసారి చేతనులైన ప్రజలు బద్ధజీవులు. వీరు బ్రహ్మోత్సవాలలో వివిధ సేవలు చేస్తున్నారు.

భాగవత మహాపురాణ కథ

మనం ఈనాడు అనుసరిస్తున్నది పౌరాణిక మతం. బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజులే ఎందుకు చేస్తారనే ప్రశ్నకు భాగవత పురాణ సృష్టికథ సమాధానం చెప్పింది.

బ్రహ్మ సృష్టి ప్రక్రియ పూర్తి చేయడానికి నవబ్రహ్మలను సృజించాడు. వీరే ప్రజాపతులు. సృష్టితత్త్వం తొమ్మిది విభాగాలుగా ఉన్నది. 'నవ' మంటే నూతనం అని ఒక అర్థమైతే తొమ్మిది అని కూడ అర్థం. నవనవోన్మేషమైన సృష్టి నవసర్గాత్మకం!

'సర్గము' అంటే సృష్టి. దీన్నే నవసర్గములంటారు. తొమ్మిది విధాల సృష్టిని రెండుగా వింగడించారు. 1)ప్రాకృత

సర్గం 2)వైకృత సర్గం. మొదటిది విష్ణువే చేశాడు. ఇది ఐదు విధాలు. 1)మహత్తత్త్వసర్గం 2) అహంకారసర్గం 3)భూతేంద్రియ సర్గం 4)అధిదైవసర్గం 5)తమస్సర్గం. ప్రప్రథమ ప్రజాపతియైన కర్దమునికి, దేవహూతికి జన్మించిన కపిల మహర్షి సాంఖ్య దర్శన ప్రవర్తకుడు. ఈయన విష్ణువు అవతారం. 24 తత్త్వాలను ఈయన దర్శించగా, విరాట్పురుషుడైన నారాయణుడు 25వ తత్త్వంగా ప్రకాశించాడు.

ఈ తత్త్వాలకు ఉపాధియైన జీవుని సృష్టింపుమని విష్ణువు బ్రహ్మను ఆదేశించాడు. జీవ సృష్టిని చేపట్టిన బ్రహ్మ దాన్ని నాల్గు విధాలుగా చేశాడు. 1) వృక్షాదిసర్గం 2)మృగ ముఖ్యసర్గం 3) మానుషాఖ్యసర్గం 4) అమరుసర్గం. ముందుగా ఫలాలనిచ్చే చెట్లు, చేమలు, సాధు, క్రూరజంతువులు, స్త్రీ-పురుషులు, దేవతలు సృజింపబడ్డారు. ఈ విధంగా విష్ణువు చేసిన ప్రాకృత సర్గం. బ్రహ్మచేసిన వైకృత సర్గం (5+4=9) రెండూ చేరగా నవసర్గాత్మకమైన సృష్టి ప్రక్రియ పూర్తయింది. **తండ్రి ఆజ్ఞను శిరసావహించి, తపస్సు చేసి, తొమ్మిది విధాలైన సృష్టులతో ప్రపంచాన్ని నిర్మించిన బ్రహ్మ, తన తండ్రి విష్ణువుకు తొమ్మిది రోజులు చేసిన ఉత్సవాలనే బ్రహ్మోత్సవాలంటారు.**

రామాయణ, మహాభారతాల్లో కథలు

ఆదిశేష, గరుదుల్ని వేదకాలంలోనే బ్రహ్మ సృష్టించాడు. సృష్ట్యాదిలో జరిగిన క్షీరసాగరమథనంలో కల్పవృక్షం, ఐరావతమనే ఏనుగు, ఉచ్చైశ్రవమనే గుఱ్ఱం

తిరుమల తిరుపతి దేవస్థానములవారు
భక్తుల సౌకర్యార్థం నడకదారిలో
యాత్రికుల రక్షణ, వైద్య సదుపాయం,
త్రాగునీరు, శౌచాలయాలు,
స్వామి దర్శనానికై
బయోమెట్రిక్ కేంద్రాలు
ఏర్పాటు చేసినారు.

పుట్టాయి. విష్ణువు మోహినీ అవతారమెత్తి దేవతలకు అమృతం పంచాడు. భాగవతంలోని 21 అవతారాలలో హంసావతారం, మోహినీ అవతారాలు చెప్పబడినాయి. త్రేతాయుగంలో హనుమంతుడు రామదూతగా 'చిరంజీవి'గా ప్రఖ్యాతి పొందాడు. రామాయణంలో జటాయువు వంశ వృక్షంలో పక్షిజాతులన్నీ చెప్పి గరుడుని వంశంగా గుర్తింపబడింది. మహాభారతంలో కశ్యపుని భార్యలైన కద్రువకు పాములు, వినతకు పక్షులు పుట్టాయని చెప్పి ఆదిశేష, గరుడుల వృత్తాంతం చెప్పబడింది. వ్యాసుడు, నన్నయ అనంతస్తుతి చేశారు. సృష్టిలో ఉత్తమశ్రేణికి చెందిన జంతుజాలాలన్నీ స్వామిసేవలో పాల్గొన్నాయి. దేవతల్లో సూర్య చంద్రులు బ్రహ్మ అనుమతితో స్వామిసేవలో పాల్గొన్నారు. స్త్రీలు, పురుషులు వారి వారి శక్తి కొద్దీ సేవలు చేస్తున్నారు.

భగవద్గీతలోని ఆధారాలు

భగవద్గీత-విభూతియోగంలో- ఆదిశేషుడు, గరుదుడు, సింహము, నరేంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, ఉచ్చైశ్రవం, ఐరావతం, భగవద్విభూతులుగా చెప్పబడ్డాయి. ఆగమశాస్త్రాలు వీటిని అంగీకరించాయి.

ప్రతి ఉత్సవానికి ముందుగా 'బ్రహ్మరథం' అనే చిన్న తేరు బయలుదేరుతుంది.

రెండవ సమన్వయం-తొమ్మిది విధాలైన సృష్టి, తొమ్మిది మాసాలలో పుట్టే జీవసృష్టిని స్ఫురింపజేస్తుంది. నవజాత శిశువు నవమాసాలు తల్లి కడుపులో ఉంటాడు. మూడవ సమన్వయం-ముముక్షువులు ఒక పుణ్యక్షేత్రంలో గర్భవాసకాలం ఉండాలని ధర్మశాస్త్రం చెబుతుంది. చివరికి తొమ్మిది రోజులైనా లేక తొమ్మిది గంటలైనా ఉంటే మంచిది. అదే గరుడసేవరోజుగా చెప్పవచ్చు.

ఉత్కృష్టమైన యజ్ఞమే ఉత్సవం (ఉత్+సవ) 'సవ మంటే సాంసారిక దుఃఖం. దాన్ని పోగొట్టి ఉత్కృష్టమైన ఆనందాన్ని ప్రసాదించేదే శ్రీవారి బ్రహ్మోత్సవం. ఆ ఆనంద నిలయుని అనంతమైన అనుగ్రహంకోసం భక్తులు ఓపికగా వేచి ఉన్నారు.

యః పుమాన్ వేంకటేశస్యమహిమాక్షీరసాగరే,
స్నానాచారపరోనిత్యం, స ధన్యః పుణ్యవర్ధనః

"శ్రీవేంకటపతి మహిమాక్షీర సముద్రంలో నిత్యం స్నానం ఆచరించే మానవుడు పుణ్యం మూటకట్టుకుంటాడు. ధన్యుడవుతాడు" – అని భవిష్యోత్తర పురాణం చెబుతోంది.

శ్రీవేంకటేశ్వర నామాన్ని నిత్యం స్మరించడం. ఆయన మహిమలను నిత్యం పారాయణం చేయడం, ఆయన మనకు అనుగ్రహించిన వరాలను కృతజ్ఞతతో నిత్యం గుర్తు చేసుకోవడం.. వంటివన్నీ సదాచారాలుగా గుర్తింపబడ్డాయి. అంతటి స్వామిని బ్రహ్మోత్సవ శుభవేళ మరిన్ని సార్లు మరింత భక్తితో ఎంతో కృతజ్ఞతతో తలుచుకోవడం వల్ల మనిషికీ సర్వశుభాలు చేకూరుతాయి. సకలపాపాల నుండి విముక్తుడవుతాడు.

ఏడాదికి నాలుగొందల ఏభైకి పైగా ఉత్సవాలు, ఏడుకొండలవాడి పేరిట జరుగుతాయి. నిత్యం కల్యాణోత్సవం, సుప్రభాతసేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, ఏకాంతసేవ వంటివి ఉంటాయి. వాటిని నిత్యోత్సవాలు అంటారు. విశేష పూజ, అష్టదళపాదపద్మారాధన, సహస్ర కలశాభిషేకం, శుక్రవార అభిషేకం, తిరుప్పావడసేవ, పూలంగిసేవ వంటివి వారానికి ఒకటి జరుగుతాయి.

ఇవికాక నక్షత్ర ఉత్సవాలు, తిరుమంజనాలు, ఉగాది ఆస్థానం, ఆణివర ఆస్థానం, జ్యేష్ఠాభిషేకం, పవిత్రోత్సవం, పద్మావతీ పరిణయోత్సవం వంటివి ఏడాదికొక్కటి. ఇలా నిత్యమూ పండుగే కనుక **'నిత్య కల్యాణం పచ్చతోరణం'** అనే మాట శ్రీవేంకటాచలానికి అక్షరాల సరితూగుతుంది.

'ఇన్ని రకాల ఉత్సవాలు ఒక ఎత్తు, బ్రహ్మోత్సవాలు మరో ఎత్తు' అనే మాట లోకంలో స్థిరపడింది. బ్రహ్మోత్సవ వైభవం వర్ణనా తీతం. బ్రహ్మోత్సవాలలో పాల్గొనే అవకాశం లభిస్తే జన్మచరితార్థమవుతుందన్న భక్తులనమ్మకం వెనుక ఎన్నో కారణాలు కనిపిస్తాయి. హాజరయ్యే ఇన్ని లక్షల మంది భక్తులలో... 'ఒక సూర్యుండు సమస్తజీవులకు తానొక్కక్కడై తోచు' అన్నట్లుగ ఎవరి తీపి అనుభూతి వారిది. ఎవరి పురాకృత సుకృత విశేషం వారిది. ఎవరికి లభించే అనుగ్రహం వారిది. 'చేసుకున్న వారికి చేసుకున్నంత'గా లభిస్తుంది. ఏం చేసుకోవాలి ఏం దక్కుతుంది అన్నది అన్నమయ్య ఆయాసందర్భాలలో విశేషంగా వర్ణించాడు.

కన్యామాసంలో శ్రవణానక్షత్రానికి ముందు పదిరోజుల పాటు శ్రీవారి ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. వాటినే అవతార దినోత్సవాలు అనీ అంటారు. వీటిని తొట్టతొలుత సాక్షాత్తు బ్రహ్మదేవుడే నిర్వహించిన కారణంగా వీటికి 'బ్రహ్మోత్సవాలు' అనే పేరు వచ్చింది. ధ్వజారోహణంతో మొదలై శ్రీవారి జన్మనక్షత్రం రోజు చక్రస్నానంతో పదిరోజులు బ్రహ్మోత్సవ వేడుకలు పరిసమాప్తమౌతాయి.

బ్రహ్మోత్సవాలకు నలుదిక్కులనుంచి తరలి వచ్చే భక్తులంతా 'సుప్రతముల తోడనె వత్తురు కదిలి...' అని అన్నమయ్య వర్ణించాడు. విశేషమంతా ఈ 'సుప్రతులు' అనే



మాటలో ఉంది. భవిష్యోత్తర పురాణం చెప్పినట్లుగా మనిషి పుణ్యజీవి, ధన్యజీవి కావాలంటే ముందు సువ్రతుడు కావాలి. 'వెన్నతో నాకు కల్గె వేంకటేశు మంత్రము' అని అన్నమయ్య చెప్పుకున్నాడు. అలా స్వభావసిద్ధంగా శ్రీవారి పాదపద్మాలపై భక్తి కుదురుకోవడం సువ్రతలక్షణం. కనుకనే, "నిగిడి శ్రీ వేంకటపతి నిజదాసుడై భక్తి దగిలి నిలుపు నాడె ధన్యుడైన యోగి" అని అన్నమయ్య స్పష్టంగా ప్రకటించాడు. అలాంటి వారికి బ్రహ్మోత్సవాలలో పరమానందం దక్కుతుండడంలో అతిశయోక్తి ఏమీ లేదు. కనుక భక్తితో తపనతో ఆర్తితో ఆపేక్షతో శ్రీవారి దర్శనానికి రావాలే తప్ప- తిరుమలకు రావడం 'విహారయాత్ర' కాదని అన్నమయ్య ఆంతర్యం!

ఇక బ్రహ్మోత్సవ శుభదినాల్లో భక్తులు మరింత భక్తి శ్రద్ధలతో శ్రీవారి దర్శనానికి తరలిరావాలి. ముందుగా దర్శనం ఇప్పించమని ప్రార్థిస్తూ 'వేంకటేశ్వర దీక్ష' చేపట్టాలి. స్వామి దివ్యసాక్షాత్కార విశేష అనుభవం కలగాలని సంకల్పం తీసుకోవాలి. మన ఇళ్లకు సంక్రాంతి పండుగ శోభ కావాలనుకుంటే- ముందుగానే ఇల్లంతా బూజులు దులుపుకని, గడపలకు పసుపురాసుకుని, గుమ్మాలకు పచ్చని మామిడాకులు కట్టుకుని ఇల్లువాకిలీ శుభ్రం చేసుకుంటేనే కదా- పండుగకళ వచ్చేది! అవేమీ లేకుండా- జనవరి పధ్నాలుగు పదిహేను తేదీలు వచ్చేసరికి పండుగ దానంతటది వచ్చి తలుపు తట్టడం సాధ్యం కాదు కదా! సంక్రాంతి స్పర్శ మనసుకు తాకేది ముందుగ చేపట్టే ఆ చక్కని సన్నాహాలలోనే! ఎంతో ముందుగా ఎంత శ్రద్ధగా ఎంత ఓపికగా పండుగల పనులు చేపడతామో - అంత నిండుగ అంత కళగా అంత తృప్తిగ సంక్రాంతి మన యింట అడుగుపెడుతుంది. బ్రహ్మోత్సవాలలో ప్రయాణానికీ ముందుగా మానసికంగా అలా మనం తయారవడమే- వేంకటేశ్వర దీక్ష!

"తల్లియు తండ్రియు గురువు ఎల్ల సంపదలునై ఎల్ల చందముల నను బ్రోచు శేషాద్రినాథుని కొలిచి..." తరిస్తామంటూ ఉత్సాహంగా ఉవ్విళ్ళూరడమే- మనసులో బూజులు దులుపుకోవడం అంటే! ఆ స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని నిరంతరం ధ్యానిస్తూ ఉండడమే- గుండె గడపలకు పసుపులు పూయడం. నిత్యం ధ్యానం స్నానం నామసంకీర్తనాదులతో ఇంటినీ వంటినీ పరిశుభ్రంగా ఉంచుకుంటే - గుమ్మానికి మంగళతోరణాలు అలంకరించినట్లే! తిరుమల ప్రయాణానికి ముందు ఇలాంటి సన్నాహాలతో శారీరకంగానూ మానసికంగానూ దీక్షితులమై ఉంటే 'సువ్రతలం' అవుతాం. ఇలా అన్నమయ్య వివిధ సందర్భాలలో చెప్పిన విశేషాలను క్రోడీకరించుకుంటూ బ్రహ్మోత్సవ శుభదినాలలో శ్రీవారి దివ్యదర్శనానికి సిద్ధం కావాలి.

తలుపులు తెరిచిన కిటికీ నుండి గాలీ వెలుతురూ గదిలోకి ప్రవేశించినట్లుగానే - బూజులు దులిపి పరిశుభ్రంగా తయారుచేసుకున్న మనసుతో తిరుమల క్షేత్రంలోకి అడుగు పెట్టగానే అక్కడి కొండల్లో ప్రతి శిలా సాల గ్రామమై దర్శనం ఇస్తుంది. కొండ శిఖరాల నుండి జాలువారే ప్రతి నీటి బిందువు తీర్థమై మనల్ని పవిత్రులను చేస్తుంది. "వేదములే శిలలై వెలసినదీ కొండ... శ్రీదేవుడు ఉండేటి శేషాద్రి కొండ"గా అన్నమయ్యకు ఎలా దర్శన మైందో- మనకూ అలానే గోచరిస్తుంది. ప్రతి గాలి తునకా అన్నమయ్య పాట మొలకై పలకరిస్తుంది. ప్రయాణ బడలికను ఆలోచనల అలసటను తొలగిస్తుంది. మనసును చల్లబరుస్తుంది. ప్రశాంతతను అనుగ్రహిస్తుంది. ప్రయాణం తీర్థయాత్రగా మారుతుంది. క్రమంగా మనం స్వామి సన్నిధికి చేరుకుంటాం.

అన్నమయ్య చెప్పినట్లు సువ్రతులమై దీక్షాసంకల్పాల నాటి నుంచి తపిస్తూ ఆనందనిలయంలోకి ప్రవేశించేసరికి ప్రచండ మార్తాండ మండల సహస్ర దుర్నిరీక్ష్య సహజ తేజో విరాజిత సాలగ్రామ శిలామూర్తి సజీవ చైతన్యంతో మృదుమధుర దరహాసంతో చల్లని ప్రసన్నమైన చూపులతో మనకు దివ్యసాక్షాత్కార విశేష అనుభవాన్ని ప్రసాదిస్తాడు. బ్రహ్మానందాన్ని అనుగ్రహిస్తాడు. దర్శనమాత్రంతో మన జన్మజన్మాంతర పాపరాశిని సమూలంగా దహిస్తాడు. ముక్తులను చేస్తాడు. ఇదంతా ఒకానొక క్రమ పరిణామ యోగం. దివ్య దర్శనభాగ్యం! చేసుకున్నవారికి చేసుకున్నంత.... అనే మాటకు అర్థం ఆ క్షణాన మనకు బోధపడుతుంది. అందుకూ! మనం బ్రహ్మోత్సవాలకు తరలి వెళ్ళేది! ఇది మనం గ్రహిస్తే జన్మతరిస్తుంది. లేకుంటే సాధారణ విహార యాత్రగా మిగులుతుంది. అంతా స్వామి దయ!

వినా వేంకటేశం ననాథో ననాథ
సదావేంకటేశం స్మరామి స్మరామి

సౌభాగ్యం

ధారావాహిక 5

పుట్టగానే... పరిమళించిన భక్తికుసుమం

శ్రీ జనాబాయి

-డా॥ పోరంకి దక్షిణామూర్తి

(జ్ఞానదేవుడు భక్తులతో గూడి నామదేవుడి ఇంటవెలసిన జనాబాయి ప్రశంసించడం... భగవంతుని అనుగ్రహం ఎట్లు పొందిందో చదివి తరించండి.)

"పరవాలేదు. నా భుక్తశేషమే తీసుకురా!" అన్నాడు హరి. ఆమె ఒక పళ్ళెం తెచ్చి ఆయన ముందు పెట్టింది. ఆయన ఆమెను కూడా తినమన్నాడు.

వాళ్ళిద్దరూ అలా కలిసి తింటూ ఉండటం చూసి రుక్మిణీ దేవి ఆశ్చర్యపడింది - అంతటి దేవుడు ఇంత చిన్న దానిమీద చూపిస్తున్న వాత్సల్యానికి!

గుణాబాయికి ఎందుకో మెలకువ వచ్చింది. భక్తురాలూ దేవుడూ కలిసి ఒక పళ్ళెంలో అన్నం తింటూండటం చూసింది. మెల్లగా కొడుకును లేపి ఆ దృశ్యాన్ని చూపించింది. "ఔనమ్మా! ఇందులో వింత ఏముంది? భగవంతుడు భక్తికి అధీనుడు కదా! రామావతారంలో శబరి ఎంగిలి పళ్ళను రాముడు తిన లేదా?" అన్నాడు. మళ్ళీ ఎవరి పక్కలమీద వాళ్ళు పడుకొన్నారు.

నాలుగో జాము రాత్రి అయింది. శ్రీహరి మళ్ళీ పక్కమీంచి లేచాడు. జనాబాయిని నిద్ర లేపాడు. ముఖం తుడిచి కూర్చోపెట్టాడు. "తల్లీ! నువ్వు రోజూ పిండి విసిరేటప్పుడు నా పాటలు పాడుతూ ఉంటావు కదా! ఆ పాటలు ఇప్పుడు వినాలని ఉంది. తిరగలికి ఒకవైపున నువ్వు కూర్చో. నీకు ఎదురుగా నేను కూర్చుంటాను. తిరగలి పిడిమీద నువ్వు చెయ్యి ఆనిస్తే చాలు, పిండి నేను విసురుతాను. నువ్వు పాడుతూ ఉంటే నేను వింటూ ఉంటాను!" అన్నాడాయన. దేవుడి మాటలకు తిరుగేముంటుంది?

పాటమీద పాట పాడుతూనే ఉంది జనాబాయి. సన్నని స్వరంతో, గుండెనిండయిన భక్తిపారవశ్యంతో సర్వాలంకారభూషితుడయిన పీతాంబరధరుడే ఆమె కళ్ళముందు కదలాడుతూ వింటూ పులకిస్తున్నాడు.

ఇంతలో జనాబాయి మనస్సులో ఒక సందేహం మెదిలింది. "స్వామీ! ఇంత దయగల తండ్రివి - కంటికి రెప్పలా కాపాడుతూ ఎవరికి ఎప్పుడుఏవి కావాలో అవన్నీ ఇస్తుండేవాడివి నువ్వు ఉండగా జనమంతా నిన్ను మరిచి పోయి, తామూ తమ ఇల్లూ తమ పిల్లలూ తమ సంపదలూ అంటూ నీకు దూరమయిపోతారెందుకు?" అని అడిగింది జనాబాయి. శ్రీహరి చిరునవ్వుతో ఇలా సమాధానమిచ్చాడు; "తల్లీ! ఇదంతా మాయ! దాని ప్రభావంవల్లే అహంకారం కమ్ముతుంది!"

"అయ్యో! వాళ్ళ గతి ఇంతేనా స్వామీ?"

"లేదమ్మా! కర్మ పరిపక్వం కావాలి. అంతవరకు నేను వేచి ఉంటాను. ఎంత మత్తెక్కినవాడయినా ఎప్పటికో ఒక ప్పటికి నన్ను తలచకమానడు; నన్ను వేడకమానడు; నన్ను చేరక మానడు!"

ఆ మాటతో తృప్తిపడి జనాబాయి మరో పాట అందుకుంది. గుణాబాయికి మళ్ళీ మెలకువ వచ్చింది. "జనాబాయి! ఎవరితోనే మాట్లాడుతున్నావ్? నీతో కలిసి పిండి విసురుతున్న దెవరు? ఈ వేళప్పుడు ఎవరిని తీసుకు వచ్చావే?" అంటూ అరిచింది. జనాబాయి మాట్లాడలేదు.

"నేనమ్మా! కృష్ణాబాయిని. పక్కింటివారి అమ్మాయిని. నిద్రపట్టడం లేదని జనాబాయి పాటలు విందామని వచ్చాను," అంటూ సమాధానమిచ్చాడు శ్రీహరి. ముసలావిడకు నమ్మకం కలగలేదు. లేచి వచ్చి గుమ్మంలోంచి చూసింది. కృష్ణాబాయి రూపమే కనిపించింది ఆవిడకు. ఇంకేమంటుంది? తన గదిలోకి వెళ్ళి పడుకుంది.

ఆ తరవాత జనాబాయి మళ్ళీ పాటలు అందుకుంది. ఈసారి నివర్తిదేవ, జ్ఞానదేవ, సోపానదేవ, గోరాకుంభార్ వంటి భగవద్భక్తుల ఘనతను కీర్తిస్తూ పాడింది.

పిండి విసరడం పూర్తి అయింది. శ్రీహరి లేచి వెళ్ళి మళ్ళీ తన పక్కమీద పడుకొన్నాడు. జనాబాయి తన గదిలో పడుకుంది. కాసేపు కునుకు పట్టిందో లేదో - ఎక్కడో కోడి

కూసింది. జనాబాయి లేచి వెళ్ళి శ్రీహరిని లేపింది. "స్వామీ! తెల్లవారబోతుంది, కాస్సేపట్లో మిమ్మల్ని అర్చించడానికీ దర్శించడానికీ ఎందరో భక్తులు మీ గుడికి వచ్చి కాసుకొని ఉంటారు. ఇక లేవండి!" అంది. శ్రీహరి తత్తరపడుతున్నట్లుగా లేచాడు. జనాబాయి గదిలో కనిపించిన పాతచీర ఒకటి కప్పుకొని తన బట్టలు మూటకట్టి ఒక మూలన పెట్టి బయటికి వెళ్ళిపోయాడు.

తెల్లవారింది. ఆలయం అర్చకులు తలుపులు తెరిచి చూసేసరికి, పాండురంగడు ఒక పాతచీర కప్పుకొని ఉన్నట్టుగా కనిపించింది విగ్రహం. మామూలుగా ధరించే ఆభరణాలేవీ ఆయన ఒంటిమీద లేవు! అర్చకులు ఆశ్చర్యపోయారు. ఆ పాత చీర అక్కడికి ఎలా వచ్చిందో తెలుసుకోలేకపోయారు. అది ఎవరిదో తేల్చుకోలేకపోయారు. చీర ఎవరిదో తేలితే నగలు కూడా దొరుకుతాయనుకున్నారు. ఒకాయన మనస్సులో తళుక్కున మెరుపు మెరిసింది. ఆ చీర జనాబాయి కట్టుకొని ఉండగా చాలాసార్లు చూశానని చెప్పాడు. ఆ మాట చాలు!

అర్చకబృందం నామదేవుడి ఇంటికి తరలింది. నామదేవుడు వాళ్ళకు ఆదరనమస్కారాలు చేసి వాళ్ళు వచ్చిన పని అడిగాడు. జనాబాయిని బయటికి పిలవమన్నారు వాళ్ళు. ఆమె వచ్చింది. "ఈ చీర నీదేనా?" అని అడిగారు. ఔనంది పాండురంగడి నగలు దొంగిలించి ఎక్కడ దాచావో తెచ్చి ఇమ్మన్నారు. వాటి సంగతి తనకు తెలియదన్నది జనాబాయి.

వచ్చినవాళ్ళు ఇంట్లోకి చొరబడ్డారు. జనాబాయి గది అంతా గాలించాడు. ఒక మూల ఒక బట్టల మూట కనిపించింది. అందులో పండరినాథుడి పట్టువస్త్రాలే కాక, ఆయన ధరించే నగలన్నీ కూడా ఉన్నాయి! జనాబాయి తెల్లబోయింది.

అర్చకబృందంవారు జనాబాయిని వెంటబెట్టుకొని పురపాలనాధికారుల దగ్గరికి వెళ్ళారు. జరిగిన సంగతి చెప్పారు. భగవంతుడి ద్రవ్యాన్ని అపహరించినందుకు ఈమెను బహిరంగ ప్రదేశంలో శూలానికి వెయ్యాలని చెప్పారు.

జనాబాయికి ఇదేమీ పట్టినట్లు లేదు. దైవ నామస్మరణలో నిమగ్నురాలయి ఉంది ఆమె. ఒక ఇనప శూలానికి గుచ్చడమే తరవాయి. ఆమెను శూలందగ్గరికి లాక్కొని వెళ్ళి నిలబెట్టారు. ఒక్కసారి భగ్గున మంటలు లేచి శూలం కాలిబూడిద అయింది. చూపరులందరూ తెల్లబోయారు. తాము చేసిన తప్పుకు సిగ్గుపడిపోయారు. ఆమె కాళ్ళకు మొక్కి క్షమాపణలు చెప్పుకున్నారు. ఎవళ్ళ దారిన వాళ్ళు పోయారు.

ఆనాటినుంచి ఇంట బయటా కూడా అందరూ జనాబాయిని చాలా గౌరవాదరాలతో చూడసాగారు. ఆమె తన అంతరంగ సాధనలో ఇంకా ఇంకా లోతులకు వెళ్ళింది. గుండెలో పెల్లుబికిన భావావేశాన్ని కవితాలతలుగా అల్లడం మొదలుపెట్టింది.

ఒకనాడు జనాబాయి నామదేవుడి ఇంటి వాకిట్లో కూర్చుని కరుణామయుడిమీద కవితలు అల్లుతూ ఉంది. అదే సమయంలో పాండురంగడు తన ఆలయంలో ఏకాంతంగా కూర్చుని జనాబాయి పాడే కృతులను తాటేకులమీద గంటంతో రాస్తూ ఉన్నాడు. ఆ సమయంలో జ్ఞానదేవుడు ఆయన దర్శనానికి వచ్చాడు. అతన్ని చూడగానే, రాస్తున్న తాటేకును ఉత్తరీయం మరుగున దాచాడు రంగడు. "స్వామీ! నా దగ్గర దాపరికమా?" అని అడిగాడు జ్ఞానదేవుడు. "లేదు నాయనా! నామదేవుడి ఇంట్లో జనాబాయి నామీద కవితలల్లుతోంది. ఆమె భక్తికి మెచ్చి వాటిని నేనిక్కడ రాసి పెట్టుకుంటున్నాను," అన్నాడు దేవుడు. జ్ఞానేశ్వరుడు ఆశ్చర్యపోయాడు. వెంటనే నామదేవుడి ఇంటికి బయలుదేరాడు. కూడా మరికొందరు మహాభక్తులను వెంటబెట్టుకొని వెళ్ళి ఆమెను దర్శించి ప్రశంసించాడు. కృష్ణావతార కాలంలో ఆ భగవంతుడి అనుగ్రహానికి పాత్రురాలయిన కుబ్జ – ఏకవక్ర– జనాబాయిగా ఇప్పుడు జన్మించిందని తెలుసుకొని ఆనందించాడు.

జీవితకాలమంతా హరిభజనలోనే గడిపి అంతంలో హరిసాయుజ్యం పొందిన జనాబాయి ధన్యురాలు కదా!

(అయిపోయింది)

అదె చూడరె మోహనరూపం......

- శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి

కలియుగవైకుంఠునికి నిత్యమూ ఎన్నోరకాలైన సేవలు జరుగుతూంటాయి. అలా ఏ సేవకైనా సరే స్వామికి ఎన్నోరకాల ఆభరణాలు అలంకరిస్తారు. ఆ నగల అలంకారంలో స్వామిని వర్ణించ సాధ్యమా! ఆ నగలు స్వామికి అలంకరించబడ్డాయి కాబట్టే ఆ నగలకు అందమూ, స్వామికి ఆనందమూనూ. అంత అందమైన, విలువైన ఆనందకారక ఆభరణాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి భక్తులకుండటం సహజం. ఆ ఆసక్తికర అభరణ విశేషాలేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.....

దివ్యమనోహరరూపం

స్వయంభువుగా ఆవిర్భవించిన స్వామివారి రూపం ఎంతో మంగళప్రదాయక దివ్యమనోహరరూపంలో ఉంటుంది. ఆ శిలావిగ్రహం కట్యవలంబిత ముద్రలో ఉంటుంది. అది భక్తులకు భక్తిప్రదాయకంగా కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులందరూకూడా ఈ సుందర విగ్రహరూపాన్ని చూచి ఎంతగానో పులకించి, తరిస్తున్నారు. అదంతా ఆ స్వామి మాహాత్మ్యమే!

మూలవిరాట్టుకు ధృవమూర్తి, మూలమూర్తి అని పేర్లు. విగ్రహం నిటారుగాకాక రెండుడిగ్రీలు (అంశలు) ఎడమవైపుకు వంగినట్లుంటుంది. పాదాలక్రింద శ్రీచక్రముంటుంది. స్వామివిగ్రహం స్త్రీవలె సుకుమారంగా ఉంటుంది. శ్రీవారి శిలావిగ్రహం ఎత్తు దాదాపు ఎనిమిదిఅడుగులుంటుంది. ఆ విధంగా స్వామి స్థానక (నిలబడియున్నట్లున్న) భంగిమలో ఉంటాడు. స్వామివారు తన దర్శనానికై వచ్చే భక్తులందరికీకూడా సమదృష్టిని ప్రసరిస్తూన్నట్లుంటాడు. ఆ స్వామి ముఖారవిందం సుందరదరహాసంతో ఉన్నట్లుంటుంది. వేంకటేశ్వరుని వెంట్రుకలు భుజస్కంధాలపై దాకా ఉన్నట్లుంటాయి. స్వామి చెవులకు అందమైన కుండలాలుంటాయి. స్వామి శంఖంలాంటి మెడను కల్గియుంటాడు. సింహమహత్త్వంతో కూడినట్లున్న గంభీరమైన దేహాకృతితో ఉంటాడు. స్వామికి నాలుగుచేతులుంటాయి. పై రెండుచేతుల్లో శంఖచక్రాలుంటాయి. కిందనున్న కుడిచేయి వరదహస్తముద్రలో ఉంటుంది. ఎడమచేయి కట్యవలంబితముద్రలో ఉంటుంది. స్వామి వక్షఃస్థలం కుడివైపు శ్రీమహాలక్ష్మి కూర్చున్నభంగిమలో కనిపిస్తుంది. స్వామి కాళ్ళు, పాదాలు ఎంతో అందమైన ఆకృతిలో బలంగా ఉంటాయి. మొత్తానికి స్వామిరూపం ఎంతో దివ్యమనోహరంగా స్ఫురించే మంగళమూర్తివలె ప్రతిబింబిస్తుంటుంది.

అమూల్యాభరణాలు

శ్రీ వేంకటేశ్వరునివిగ్రహానికి ఎందరో రాజులు, ఆంగ్లేయులు, నవాబులు, మహంతులు ఇంకనూ ఆ తరువాతనుంచీకూడా ఎందరో భక్తులు ఎన్నోరకాల ఆభరణాలను ఇబ్బడిముబ్బడిగా సమర్పించుకున్నారు. అందులో మొట్టమొదట నారాయణవనం అధిపతి ఆకాశ రాజు శ్రీవారికి ఒక బంగారుకిరీటాన్ని చేయించినట్లు శాసనాలద్వారా తెలుస్తోంది. అలాగే శ్రీకృష్ణదేవరాయలు ఇతరసామ్రాజ్యాలపై యుద్ధానంతరం విజయులై తిరిగివస్తూ స్వామివారిని దర్శించుకునేవారు. అంతటి ప్రభుభక్తి కల్గినవారు వీరు, ఆ సమయంలో ఎన్నో ఆభరణరాశు



లను కానుకలుగా సమర్పించుకోవడం జరిగింది. అందులో మలయప్పస్వామికి అలంకరించబడే గుండ్రనికిరీటం, మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక ఉత్సవాల్లో ఎదపై అలంకరించబడే పెద్దపచ్చ, బంగారుకత్తి, పచ్చలు పొదిగిన బంగారుకత్తులు, రత్నాలు పొదిగిన కంఠాభరణాలు, నవరత్నకిరీటం, త్రిసరహారం, మూడుబారువుల కంఠహారం, ఇంద్రనీలాలు, గోమేధికాలు, మాణిక్యాలు మొదలైనవి ముఖ్యమైనవి. అలాగే 1985వ సం॥ డిసెంబరు 20వతేదీన తిరుమలతిరుపతిదేవస్థానం దాదాపు ఐదు కోట్లరూపాయలవ్యయంతో, 2.5కిలోల బంగారంతో, కొన్ని వేలవజ్రాలను పొదిగించిన వజ్రకిరీటాన్ని తయారు చేయించి శ్రీవారికి అలంకరించడం జరిగింది. అలాగే శ్రీవారికంఠాన్ని అలంకరించే చిన్నమకరకంఠహారం, పెద్ద మకరకంఠహారం, ఐదుబారువులతో అలరారే లక్ష్మీహారం, చెవులకు సింగారంగా రెండు రత్నఖచితకుండలాలు, బంగారంమీద రత్నాలు పొదిగిన శంఖచక్రాలు, అభయ హస్తం, కటిహస్తాలకు కూడా రత్నాలపొదుగుల తొడుగులున్నాయి. అతి ముఖ్యమైనరోజుల్లో మాత్రమే స్వామివారికి స్వర్ణపీతాంబరం అలంకరిస్తారు. అలా పీతాంబరాన్ని, ఒక మకరకంఠహారాన్ని తిరుమలతిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పడక ముందు తిరుమల శ్రీవారిఆలయాన్ని పాలిస్తూన్న మహంతులు చేయించారు.

